JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 23-08-2026

Medchal - Malkajgiri । Sunday 23-08-2026

Follow: jayabherinews

సంపుటి : 03 । సంచిక : 83

పేజీలు : 8 । వెల : 5

Vol. 03 । Issue 83 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com






# గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం


- నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది
- 50 గజాల్లో ఎన్ని అంతస్తులు కట్టుకోవచ్చు?
- 7 అంతస్తులు నిర్మించాలంటే?

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 22 :**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. నాలా పక్కనే 50 గజాల చిన్న స్థలంలో ఇంత భారీ నిర్మాణం చేపట్టడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనలో మృతులను ఉమేశ్ కారే (34), మోపత్ (42)గా పోలీసులు గుర్తించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన వీరిద్దరూ టైల్స్ కార్మికులుగా పనిచేస్తూ కొండాపూర్‌లో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. నిర్మాణం పూర్తయి అద్దెలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఈ భవనం ఈ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కుప్పకూలడంతో.. ఆ శిథిలాలు పడి పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్‌లో ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. ఒకవేళ సాయంత్రం సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటే మాత్రం ప్రాణ నష్టం అధికంగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

**50 గజాల్లో ఎన్ని అంతస్తులు కట్టుకోవచ్చు?**

అయితే హైదరాబాద్‌లో చిన్న స్థలంలో ఇల్లు నిర్మించాలనుకునేవారికి అంతస్తుల విషయంలో అనేక సందేహాలు ఉంటాయి. ముఖ్యంగా 50 గజాల స్థలంలో ఎన్ని అంతస్తులు నిర్మించవచ్చనే ప్రశ్నకు ప్రభుత్వ నిబంధనలు స్పష్టమైన పరిమితులు విధిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో భవన నిర్మాణ అనుమతులు ప్రధానంగా TGbPASS విధానం ద్వారా అమలవుతున్నాయి. 75 చదరపు గజాల వరకు ఉన్న నివాస ప్లాట్లకు గ్రౌండ్ లేదా గ్రౌండ్+1 అంతస్తు నిర్మాణానికి ప్రత్యేక మినహాయింపు ఉంది. అయితే ఆ నిర్మాణాన్ని ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయడం తప్పనిసరి. అంటే 50 గజాల స్థలంలో నేరుగా 7 అంతస్తుల భవనం నిర్మించడానికి సాధారణ అనుమతి లేదు. TGbPASS అధికారిక ఫ్లోచార్ట్ ప్రకారం 75 గజాల వరకు ఉన్న ప్లాట్లకు ...మిగతాది 2 లో



# ఉత్తరాంధ్రకు మరో భారీవరం

- అనకాపల్లి ఇండస్ట్రియల్ హబ్ పై సీఎం చంద్రబాబు కీలకప్రకటన
- ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుంటే కొందరు వీటిపై తప్పుడు ప్రచారం
- ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం

**జయభేరి, అనకాపల్లి :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అనకాపల్లి అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. అనకాపల్లి దశ త్వరలోనే మారబోతుందని అన్నారు. అనకాపల్లి కేవలం బెల్లానికి మాత్రమే పరిమితం కాదని, రాబోయే రోజుల్లో దేశంలోనే అత్యుత్తమ ఇండస్ట్రియల్ హబ్‌గా ఆవిర్భవిస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలు అభిమానించడమే తమకు అసలైన తృప్తినిస్తుందని పేర్కొన్నారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ పై అసత్య ప్రచారం చేస్తున్నారన్న సీఎం సమాజానికి మంచి చేసే ప్రతి పనిలోనూ సవాళ్లు, విమర్శలు ఎదురవుతాయని, అయినప్పటికీ అభివృద్ధి ప్రయాణం ఆగదని తేల్చి చెప్పారు. తమ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుంటే కొందరు వీటిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ వస్తే నీటిఎద్దడి తలెత్తుతుందని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. డేటా సెంటర్ ఇంకా ప్రారంభమే కాకముందు నీళ్లు ఇంకిపోయాయని చెప్పడం వారి అవగాహనా ...మిగతాది 2 లో

# ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు

- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం
- భూభారతి సదస్సులు, సాదాబైనామా అర్జీలను వెంటనే పరిష్కరించాలి
- రూ.230కే సిమెంట్ బ్యాగ్.. పేదల సొంతింటి కల సాకారం
- నిజామాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌కు స్థల పరిశీలన
- ఉమ్మడి నిజామాబాద్ లో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన




**జయభేరి, నిజామాబాద్ :**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏడాదిన్నర లోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం నాడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఆ తర్వాత డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ...మిగతాది 2 లో




# అందుకేనా కేంద్రం బ్రేక్?

## అమెరికాలో ఆ ఇద్దరు వీవీఐపీలతో భేటీకి రేవంత్..!

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా బ్రిటన్ టూర్ కు వెళ్లారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నారు. అయితే ఆయన బ్రిటన్ టూర్ వెళ్లేందుకు అనుమతి ఇచ్చిన కేంద్రం.. ఆ తర్వాత అమెరికా టూర్ కు మాత్రం వెళ్లకుండా బ్రేక్ వేసేసింది. రాజకీయ కారణాలతో తెలంగాణ ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వలేదని నిన్న విదేశాంగశాఖ వివరణ ఇచ్చింది. అయితే ఆ కారణాలు ఏంటో మాత్రం బయటపెట్టలేదు. అయితే అమెరికాలో ఇద్దరు పెద్దల్ని కలిసేందుకు రేవంత్ రెడ్డి ప్లాన్ చేయడం వల్లే ఈ టూర్ కు కేంద్రం బ్రేక్ వేసినట్లు సమాచారం. బ్రిటన్ నుంచి అమెరికా వెళ్లి అక్కడ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ను, న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీని కలిసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అందుకే రేవంత్ రెడ్డిని ఈ టూర్ కు వెళ్లకుండా కేంద్రం అడ్డుకున్నట్లు ఎన్డీటీవీ ఓ కథనం ప్రచురించింది. రేవంత్ రెడ్డి అమెరికా టూర్ కు రాజకీయ అనుమతిని కేంద్రం నిరాకరించడానికి ఈ ప్రతిపాదిత సమావేశాలే కీలక కారణంగా నిలిచాయని తెలుస్తోంది. అయితే అమెరికాలో వీరిద్దరినీ రేవంత్ కలవకుండా ఎందుకు అడ్డుకున్నారనే దానిపై మాత్రం కేంద్రం పూర్తి స్పష్టత ఇవ్వలేదు.

సాంకేతిక కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతోంది. దీనికి కేంద్రం, తెలంగాణ ప్రభుత్వాల విభేదాలు కారణం కాదంటోంది. సాధారణంగా మన దేశంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు విదేశాంగ మంత్రిత్వ శాఖ వాటిని సమీక్షిస్తుంది. సదరు ప్రముఖులు నిర్వహిస్తున్న పదవి, పర్యటన కోసం పేర్కొన్న ఉద్దేశ్యం వంటి కారణాలను కూడా చూస్తుంది. ఇలాంటి సందర్భాల్లో ప్రతిపాదించిన కార్యక్రమం వారు నిర్వహిస్తున్న పదవికి, పర్యటన ఉద్దేశ్యానికి అనుగుణంగా ఉండాలి. కానీ రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలో అలా లేదని తెలుస్తోంది. అందుకే రేవంత్ టూర్ కు కేంద్రం నిరాకరించినట్లు సమాచారం. అయితే తెలంగాణ ప్రభుత్వం కూడా కేంద్రం సీఎం రేవంత్ రెడ్డికి అనుమతి ఇవ్వలేదని చెప్పినా, కారణాలు మాత్రం బహిర్గతం చేయలేదు.



# బార్‌లో రచ్చ..

- కానిస్టేబుల్‌పై దాడి చేసిన బెటాలియన్ కానిస్టేబుల్
- వరంగల్ ఉరుసుగుట్ట కలింగ బార్ వద్ద న్యూసెన్స్

**జయభేరి, వరంగల్:**

వరంగల్‌లో పోలీసుల తీరుపై విమర్శలకు దారితీసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉరుసుగుట్ట వద్ద ఉన్న కలింగ బార్‌లో న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తిని అదుపు చేసేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌పై దాడి జరగగా.. అనంతరం కానిస్టేబుల్ కూడా లాఠీతో దాడి చేసిన ఘటన కలకలం రేపుతోంది. ఉరుసుగుట్ట కలింగ బార్‌లో ఓ వ్యక్తి న్యూసెన్స్ చేస్తున్నాడంటూ డయల్ 100కు సమాచారం అందింది. సమాచారం అందుకున్న మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సంతోష్ రెడ్డి బార్ వద్దకు చేరుకున్నారు.

గొడవను సద్దుమణిగించే క్రమంలో న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తిని కానిస్టేబుల్ చెంపదెబ్బ కొట్టడంతో దీంతో ఆ వ్యక్తి తిరిగి కానిస్టేబుల్‌పై చెంపదెబ్బ కొట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఆగ్రహానికి గురైన కానిస్టేబుల్ లాఠీతో ఆ వ్యక్తిపై దాడి చేశాడు అదే సమయంలో చుట్టుపక్కల ఉన్న కొందరు వ్యక్తులు కూడా అతనిపై విచక్షణారహితంగా దాడి చేశారు.

అయితే ఈ ఘటనలో మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. బార్‌లో న్యూసెన్స్ చేసిన వ్యక్తి మనోజ్ కూడా మామునూరు 4వ పోలీస్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ అని సమాచారం. మిల్స్ కాలనీ పోలీస్ లు మామునూరు ఫోర్త్ బెటాలియన్ చెందిన మనోజ్ పై కానిస్టేబుల్ సంతోష్ రెడ్డి ఫిర్యాదుతో మనోజ్ కుమార్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పంట పొలంలో బాంబు పేలుడు

- మహిళా కూలీకి తీవ్ర గాయాలు

**- జయభేరి, రేగొండ :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గూడెపల్లి గ్రామంలో పొలంలో బాంబు పేలిన ఘటన తీవ్ర కలకలం రేపింది. చేనులో నలుసు ఏరుతున్న మహిళా కూలీ కొడవలితో భూమిలో ఉన్న వస్తువును కదిలించడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో గుండె స్వర్ణలత (34) ముఖం, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను వెంటనే పరకాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గూడెపల్లికి చెందిన మోరె రాజు తన 20 గుంటల భూమిలో మిరప తోట సాగు కోసం ఇద్దరు మహిళా కూలీలతో పనులు చేయిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. భూమిలో బాంబు ఎలా వచ్చింది? ఎవరు పెట్టారు? అనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయి. గతంలో ఈ ప్రాంతంలో నక్సలైట్ల సంచారం ఉన్న నేపథ్యంలో అప్పట్లో పాతి పెట్టిన బాంబు మిగిలిపోయిందా? లేక భూ యజమానిని లక్ష్యంగా చేసుకుని ఎవరైనా కుట్రపూరితంగా బాంబు పెట్టారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పేలుడు ఘటనతో గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

▶▶ మొదటిపేజీ తరువాయి

## గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం

గ్రౌండ్+1 వరకు మాత్రమే ఈ ప్రత్యేక రిజిస్ట్రేషన్ మినహాయింపు వర్తిస్తుంది. అంతకంటే ఎక్కువ అంతస్తులు నిర్మించాలంటే సంబంధిత భవన నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక అనుమతి అవసరం. ఇక TGbPASSలో ప్రస్తుతం ఉన్న నిర్మాణ కేటగిరీల ప్రకారం 75 చదరపు గజాల నుంచి 240 చదరపు గజాల వరకు కొన్ని నివాస నిర్మాణాలకు స్టిల్ట్+2 లేదా గ్రౌండ్+1 పరిధిలో అనుమతులు ఉన్నాయి. 50 చదరపు మీటర్లకు పైగా, 500 చదరపు మీటర్ల వరకు ఉన్న ప్లాట్లకు కొన్ని సందర్భాల్లో స్టిల్ట్+3/గ్రౌండ్+2 వరకు తక్షణ అనుమతి కేటగిరీ చూపుతోంది. అయితే ప్లాట్ పరిమాణం ఒక్కటే నిర్ణయాత్మకం కాదు; రోడ్డు వెడల్పు, సెట్‌బ్యాక్‌లు, జోనింగ్, భవనం ఎత్తు, పార్కింగ్ తదితర నిబంధనలు కూడా వర్తిస్తాయి.

**7 అంతస్తులు నిర్మించాలంటే?**

7 అంతస్తుల భవనం సాధారణ చిన్నప్లాట్ సెల్ఫ్‌సర్టిఫికేషన్ పరిధిలోకి రాదు. ముఖ్యంగా భవనం ఎత్తు 18 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ అయితే దాన్ని హైరైజ్ భవనంగా పరిగణిస్తారు. హైరైజ్ నిర్మాణాలకు అదనపు సాంకేతిక, అగ్నిమాపక, నిర్మాణ భద్రతా నిబంధనలు వర్తిస్తాయి. ఇలాంటి నిర్మాణానికి ముందుగా భూమి వినియోగం, మాస్టర్ ప్లాన్/జోనింగ్ అనుకూలత, రోడ్డు వెడల్పు, అవసరమైన సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, స్ట్రక్చరల్ డిజైన్ తదితర అంశాలు పరిశీలించాలి. అవసరాన్ని బట్టి ఫైర్ NOC, ఎయిర్‌పోర్ట్ అథారిటీ హైట్ క్లియరెన్స్, నీటి సౌకర్యం, NALA/ల్యాండ్ కన్వర్షన్, FTL/నాలా సంబంధిత NOCలు, స్ట్రక్చరల్ డిజైన్‌కు థర్డ్ పార్టీ ప్రూఫ్ చెక్ వంటి అనుమతులు కూడా అవసరం. TGbPASS అధికారిక వివరాల్లో వీటికి ప్రత్యేక NOC ప్రక్రియలు ఉన్నాయి. అందువల్ల 50 గజాల స్థలంలో 7 అంతస్తులు కట్టేందుకు ఫీజు చెల్లిస్తే అనుమతి వస్తుంది అనుకోవడం తప్పు. ప్లాట్ పరిమాణం, రోడ్డు వెడల్పు, జోన్, ప్రతిపాదిత ఎత్తు, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, ఫైర్ సేఫ్టీ, స్ట్రక్చరల్ నిబంధనలు అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడే అనుమతి పరిశీలనకు వస్తుంది. 2026లో తెలంగాణ ప్రభుత్వం బిల్డింగ్ రూల్స్‌లో తాజా సవరణలు కూడా జారీ చేసినందున, నిర్మాణానికి ముందు తాజా TGbPASS నిబంధనల ప్రకారం అధికారిక ఆమోదం తీసుకోవడం అత్యంత కీలకం.

## ఉత్తరాంధ్రకు మరో భారీవరం

రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్న చంద్రబాబు ఇలాంటి తప్పుడు సమాచారంతో ప్రజలను భయపెట్టే ప్రయత్నాలను ప్రజలంతా తిప్పి కొట్టాలని సూచించారు. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా త్వరలోనే అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు గోదావరి జలాలను తరలిస్తామని హామీ ఇచ్చారు. సెప్టెంబర్ తొలి వారంలోనే ఈ పనులను పూర్తి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా గోదావరి జలాల తరలింపు వేగవంతం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా గోదావరి జలాల తరలింపును వేగవంతం చేస్తామని చెప్పారు. దీనివల్ల ఉత్తరాంధ్ర ప్రాంతంలో నీటి సమస్య తీరి, పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. అమరావతికి అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటింగ్ సాంకేతికత రావడం రాష్ట్రానికే గర్వకారణమని సీఎం హర్షం వ్యక్తం చేశారు. అనకాపల్లిని పారిశ్రామిక కేంద్రంగా మార్చడం ద్వారా ఉపాధి అవకాశాలు మంచి పనులను అడ్డుకోవాలని చూసే విమర్శలను పక్కనపెట్టి, పరిశ్రమల స్థాపన, మౌలిక వసతుల కల్పనతో ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అనకాపల్లిని పారిశ్రామిక కేంద్రంగా మార్చడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు చంద్రబాబు. స్థానిక యువతకు మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని, ప్రజల సహకారంతోనే అనుకున్నది సాధిస్తామన్నారు సీఎం చంద్రబాబు.

## ఇస్రో పరిశోధన, అత్యాధునిక సాంకేతికతలపై దృష్టి





**శ్రీహరికోట, ఆగస్టు 22 :**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇకపై లాంచ్ వెహికల్స్ తయారీ, సాధారణ శాటిలైట్ల తయారీ వంటి కార్యకలాపాల నుంచి ఇస్రో క్రమంగా తప్పుకోనుంది. ఈ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించనుంది. ఇస్రో పరిశోధన, అత్యాధునిక సాంకేతికత అభివృద్ధి, శాస్త్రీయ ప్రయోగాలు, ప్రత్యేక మిషన్లపై మరింత దృష్టి పెట్టనుంది.ఎకానమీ సమ్మిట్‌లో ఇన్‌స్పేస్ చైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకా ఈ విషయాన్ని వెల్లడించారు. "ఇస్రో ఇకపై ఎలాంటి లాంచ్ వెహికల్స్‌ను తయారు చేయదు. వాటి తయారీని ప్రైవేట్ రంగం లేదా ప్రభుత్వ రంగ సంస్థలు చేపడతాయి" అని ఆయన తెలిపారు.ఈ మార్పు ఇప్పటికే ప్రారంభమైంది. చిన్న ఉపగ్రహాలను ప్రయోగించే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ) సాంకేతికత, ఉత్పత్తి హక్కులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు బదిలీ చేశారు.తదుపరి దశలో భారత్ ప్రధాన రాకెట్లైన పీఎస్ఎల్వీ (పీఎస్ఎల్వీ), ఎల్వీఎం3 (ఎల్వీఎం3) సాంకేతికత, తయారీ కూడా ప్రైవేట్ రంగానికి బదిలీ చేసే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే ఈసారి ప్రభుత్వ రంగ సంస్థలకు బదులుగా ప్రైవేట్ పరిశ్రమలకే అవకాశం కల్పించనున్నట్లు గోయెంకా తెలిపారు. ఇకపై ఇస్రో ఒక తయారీ సంస్థగా కాకుండా ప్రధానంగా పరిశోధన, అభివృద్ధి సంస్థగా పనిచేయనుంది. కొత్త సాంకేతికతలు, శాస్త్రీయ మిషన్లు, ప్రత్యేక ఉపగ్రహాలు, అధునాతన అంతరిక్ష మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించనుంది. ఒక సాంకేతికత అభివృద్ధి చెంది వాణిజ్యపరంగా వినియోగించేందుకు సిద్ధమైన తర్వాత దానిని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తామని గోయెంకా చెప్పారు. ఇప్పటివరకు ఇస్రోకు చెందిన 120 సాంకేతికతలను ప్రైవేట్ రంగానికి బదిలీ చేసినట్లు ఆయన వెల్లడించారు.ప్రభుత్వం నిర్మిస్తున్న కొత్త లాంచ్ సెంటర్ నిర్వహణ బాధ్యతలను కూడా ప్రైవేట్ రంగానికి అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన ఆపరేటర్‌ను వచ్చే నాలుగు లేదా ఐదు నెలల్లో ఖరారు చేసే అవకాశం ఉందని గోయెంకా తెలిపారు.భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను ప్రస్తుతం ఉన్న సుమారు 8 బిలియన్ డాలర్ల నుంచి 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ప్రభుత్వ డిమాండ్, అంతరిక్ష సాంకేతికతను ఇతర రంగాల్లో విస్తృతంగా వినియోగించడం, అంతర్జాతీయ మార్కెట్లలో భారత సంస్థల విస్తరణ కీలకమని గోయెంకా చెప్పారు.ప్రభుత్వం ప్రధాన కస్టమర్‌గా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ శాఖ ఇప్పటికే ప్రైవేట్ సంస్థలకు 31 ఉపగ్రహాల తయారీకి ఆర్డర్ ఇచ్చిందని, ఇదే విస్తృత కార్యక్రమంలో భాగంగా మరో 21 ఉపగ్రహాలను ఇస్రో తయారు చేయనుందని తెలిపారు.

# హైదరాబాద్‌లో సెటిలర్స్ ప్రభావం తగ్గుతోందా?

**28 నియోజకవర్గాల్లో 15 చోట్ల ప్రభావం**

**ఓటర్ల జాబితా సవరణతో కొత్త రాజకీయ చర్చ**



హైదరాబాద్‌లో ఆంధ్రా సెటిలర్స్ ఓటర్లు ఈసారి ఏ మేరకు కనిపించబోతున్నారు? వారు తెలంగాణలోనే ఓటు హక్కును కొనసాగించారా? లేక తమ సొంత ప్రాంతాల్లోనే ఓటు ఉంచుకున్నారా? ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఈ ప్రశ్నలు ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఉన్న నియోజకవర్గాలు చాలానే ఉన్నాయి. ముఖ్యంగా కోర్ అర్బన్ ప్రాంతంలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 15 నియోజకవర్గాల్లో వారి ప్రభావం గణనీయంగా ఉందనే రాజకీయ అంచనాలు ఉన్నాయి. ప్రతి ఎన్నికల సమయంలోనూ ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు ఏ పార్టీ వైపు మొగ్గుతాయి? ఏ పార్టీకి లాభం చేకూరుతుంది? అనే చర్చ కొనసాగుతూనే ఉంటుంది. అయితే ఈసారి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కారణంగా పరిస్థితులు కొంత భిన్నంగా కనిపిస్తున్నాయి.

**73 లక్షల ఓట్లు జాబితా నుంచి బయటకు**

తెలంగాణలో చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ (SIR)లో భాగంగా భారీ సంఖ్యలో ఓట్లు ప్రస్తుత జాబితాలో లేకుండా పోయాయి. ముసాయిదా వివరాల ప్రకారం సుమారు 73 లక్షల ఓట్లను గైర్హాజరు, వేరే ప్రాంతాలకు మారడం, డూప్లికేట్ నమోదు లేదా ఇతర కారణాలతో తొలగించిన కేటగిరీలో ఉంచినట్లు సమాచారం. జూన్ నాటికి తెలంగాణలో మొత్తం ఓటర్ల సంఖ్య సుమారు 3 కోట్ల 38 లక్షల 26 వేలుగా ఉంది. అందులో 73 లక్షల ఓట్లు తొలగింపు కేటగిరీలోకి వెళ్లడం అంటే మొత్తం ఓటర్లలో దాదాపు 22 శాతం మంది ప్రభావితమైనట్టే. తాజా ముసాయిదా ప్రకారం సుమారు 2 కోట్ల 64 లక్షల 87 వేల 213 మంది ఓటర్లు జాబితాలో మిగిలారు. అయితే వీరందరి వివరాలు పూర్తిగా ధృవీకరించబడ్డాయని చెప్పలేమని అధికారులు పేర్కొంటున్నారు. మరో 92 లక్షల 87 వేల 577 ఓట్లను 'విత్‌హెల్డ్' కేటగిరీలో ఉంచినట్లు సమాచారం. మ్యాపింగ్‌లో తేడాలు, సమర్పించిన పత్రాలు 2002 నాటి రికార్డులతో సరిపోకపోవడం వంటి కారణాలతో కొన్ని ఓట్ల ధృవీకరణ ప్రక్రియ పూర్తికాలేదని చెబుతున్నారు. అంటే తొలగించిన ఓట్లు, పెండింగ్‌లో ఉన్న ఓట్లను కలిపితే సుమారు 1.66 కోట్ల ఓట్లు ప్రస్తుతం ఏదో ఒక రకంగా ప్రభావిత స్థితిలో ఉన్నట్లు కనిపిస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లోనే భారీ మార్పు ఈ వ్యవహారంలో అత్యంత ఆసక్తికరమైన అంశం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలకు సంబంధించిన గణాంకాలు. ఈ మూడు జిల్లాల పరిధిలోనే సుమారు 43 లక్షల ఓట్లు తొలగింపు కేటగిరీలోకి వెళ్లినట్లు లెక్కలు సూచిస్తున్నాయి. తెలంగాణలో తొలగింపు కేటగిరీలో ఉన్న ఓట్లలో దాదాపు 60 శాతం ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో మరో సుమారు 39 లక్షల ఓట్లు అభ్యంతరాలు, మ్యాపింగ్ లేదా ఇతర ధృవీకరణ సమస్యల కారణంగా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దీంతో తొలగించబడిన లేదా ఇంకా పూర్తిగా ధృవీకరించబడని ఓట్ల సంఖ్య ఈ మూడు జిల్లాల్లోనే దాదాపు 83 లక్షలకు చేరుతోంది. ఇక్కడే రాజకీయంగా కీలకమైన ప్రశ్న మొదలవుతోంది. ఇది కేవలం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియ మాత్రమేనా? లేక భవిష్యత్ హైదరాబాద్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపుతుందా?

**43 లక్షల ఓట్లలో అందరూ ఆంధ్రా సెటిలర్స్ కాదు**

అయితే ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాల్సి ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ప్రాంతాల్లో తొలగింపు కేటగిరీలోకి వెళ్లిన 43 లక్షల ఓట్లన్నీ ఆంధ్రా సెటిలర్స్‌వే అని చెప్పడానికి ఆధారం లేదు. హైదరాబాద్ ఒక పెద్ద మెట్రో నగరం కావడంతో తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి వచ్చినవారితో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. అయితే ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉందని భావించే నియోజకవర్గాల్లో ఓట్ల సంఖ్యలో వచ్చిన మార్పులు మాత్రం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**ఈ నియోజకవర్గాల్లో సెటిలర్స్ ప్రభావం**

మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉందనే చర్చ ఉంది. అలాగే రంగారెడ్డి, హైదరాబాద్ పరిధిలోని శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఖైరతాబాద్, రాజేంద్రనగర్, ఎల్బీనగర్ వంటి నియోజకవర్గాల్లోనూ ఆంధ్రా ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన ఓటర్ల సంఖ్య గణనీయంగా ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా కోర్ అర్బన్ ప్రాంతంలోని 28 నియోజకవర్గాల్లో దాదాపు 15 నియోజకవర్గాల్లో ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం స్పష్టంగా ఉంటుందని అంచనా.

**ఫారాలు తిరిగి ఇవ్వని వారి శాతం కూడా కీలకం**

కొన్ని నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి ఇవ్వని వారి సంఖ్య కూడా గణనీయంగా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. సనత్‌నగర్‌లో 45 శాతం, జూబ్లీహిల్స్‌లో 45 శాతం, ముషీరాబాద్‌లో 43 శాతం, ఎల్బీనగర్‌లో 44 శాతం ఫారాలు తిరిగి అందలేదని సమాచారం. అయితే ఫారాలు ఇవ్వని వారంతా ఆంధ్రా సెటిలర్స్ అని చెప్పడం సరికాదు. కానీ ఈ ప్రాంతాల్లో ఆంధ్రా ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉండటం మాత్రం వాస్తవం. క్షేత్రస్థాయి పరిశీలనలో కూడా కొందరు తమ ఓటును స్వస్థలంలోనే కొనసాగించాలని భావిస్తున్నట్లు చెప్పినట్లు సమాచారం. "మా ఓటు మా ఊరిలోనే కొనసాగిస్తాం" అనే అభిప్రాయం కొంతమందిలో కనిపించినట్లు తెలుస్తోంది.

**శేరిలింగంపల్లిలో భారీగా ఓట్ల తగ్గుదల**

నియోజకవర్గాల వారీగా చూస్తే కొన్ని ప్రాంతాల్లో ఓట్ల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు లెక్కలు సూచిస్తున్నాయి. శేరిలింగంపల్లిలో 3.2 లక్షలకు పైగా ఓట్లు తగ్గినట్లు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యధికంగా ఓట్ల తగ్గుదల కనిపించిన నియోజకవర్గాల్లో ఇది ఒకటిగా నిలిచింది. ఆ తర్వాత ఎల్బీనగర్‌లో 2.7 లక్షలు, రాజేంద్రనగర్‌లో 2.4 లక్షలు, మహేశ్వరంలో 2.3 లక్షల ఓట్లు తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే కేవలం ఎంతమంది ఓటర్లు తగ్గారన్నది మాత్రమే రాజకీయంగా ముఖ్యమైన విషయం కాదు. ఎలాంటి ఓటర్లు తగ్గారు? ఏ సామాజిక, ప్రాంతీయ వర్గాలకు చెందిన ఓటర్లు ప్రభావితమయ్యారు? అన్నదే అసలు ప్రశ్న. ఎందుకంటే ఓటర్ల సంఖ్య తగ్గడం వల్ల ప్రతి రాజకీయ పార్టీపై ఒకే విధమైన ప్రభావం ఉండదు.

**హైదరాబాద్ జిల్లాలోనూ భారీ మార్పు**

హైదరాబాద్ జిల్లాకు ప్రత్యేక పరిస్థితి ఉంది. పాతబస్తీతో పాటు నగరంలోని అనేక ప్రాంతాలను కలుపుకున్న ఈ జిల్లాలో 47 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. వారిలో సుమారు 19 లక్షల మంది తిరిగి రిజిస్టర్ చేసుకోలేదని లెక్కలు చెబుతున్నాయి. అంటే దాదాపు 40 శాతం మంది ఓటర్లపై ఏదో ఒక రకంగా ప్రభావం పడినట్లు కనిపిస్తోంది. పాతబస్తీలో కొందరు ఓటర్లకు సరైన పత్రాలు లేకపోవడం, అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించలేకపోవడం వంటి అంశాలు కూడా కారణాలుగా ఉండవచ్చని చెబుతున్నారు. ఇదే సమయంలో పత్రాలు సమర్పించిన వారిలో కూడా సుమారు 12 లక్షల మందికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాల్లో కలిపి మరో 27 లక్షల ఓట్లకు సంబంధించి నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. పత్రాల్లో తప్పులు, 2002 నాటి మ్యాపింగ్‌తో వివరాలు సరిపోకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ ఓట్లలో ఎన్ని తిరిగి ధృవీకరించబడతాయి? ఎన్ని తుది ఓటర్ల జాబితాలోకి వస్తాయి? అన్నది తదుపరి ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్పష్టమవుతుంది.

**సెటిలర్స్ ఓట్లు ఏ పార్టీకి?**

తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రా ప్రాంత ప్రజలు రాజకీయంగా కూడా కొంత ప్రభావం చూపారు. కొందరు ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ తర్వాత పరిస్థితి ఎంతవరకు మారుతుందన్నది ఆసక్తికరంగా మారింది. హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రా ప్రాంత ప్రజలు తమ ఓటును పూర్తిగా హైదరాబాద్‌కు మార్చుకున్నారా? లేక తమ స్వస్థలాల్లోనే ఓటు హక్కును కొనసాగిస్తున్నారా? అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. రెండో పరిస్థితి పెద్ద సంఖ్యలో నిజమైతే హైదరాబాద్ రాజకీయాల్లో ఒక ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకునే అవకాశం ఉంది. "హైదరాబాద్‌లో ఆంధ్రా జనాభా కనిపిస్తుంది.. కానీ ఆంధ్రా ఓటు కనిపించదు" అనే పరిస్థితి ఏర్పడితే రాజకీయ పార్టీల ఎన్నికల వ్యూహాలు కూడా మారాల్సి రావచ్చు. అయితే హైదరాబాద్‌లోని ఆంధ్రా సెటిలర్స్ ఓట్లన్నీ ఒకే పార్టీకి వెళ్తాయనే అంచనా కూడా పూర్తిగా సరైంది కాదు. గతంలో తెలంగాణలో టీడీపీ యాక్టివ్‌గా ఉన్న సమయంలో ఆంధ్రా సెటిలర్స్‌లో కొంతమంది ఆ పార్టీ వైపు మొగ్గు చూపినట్లు రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం తెలంగాణ రాజకీయ పరిస్థితులు గణనీయంగా మారాయి.

**తుది జాబితా తర్వాతే అసలు చిత్రం**

ప్రస్తుతం ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న మార్పుల ఆధారంగా ఏ పార్టీకి ఎంత నష్టం? ఏ పార్టీకి ఎంత లాభం? అన్నది కచ్చితంగా చెప్పడం తొందరపాటు అవుతుంది. SIR ప్రక్రియ ప్రధానంగా ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియ. అయితే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి వంటి కీలక ప్రాంతాల్లో భారీ సంఖ్యలో ఓట్లు తొలగింపు లేదా పెండింగ్‌లో ఉండటం మాత్రం రాజకీయంగా ప్రాధాన్యత కలిగిన అంశంగా మారింది. ముఖ్యంగా ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఉన్నట్లు భావించే నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్యలో వచ్చిన మార్పులను రాజకీయ పార్టీలు నిశితంగా పరిశీలించే అవకాశం ఉంది. పాతబస్తీలోనూ ఓటర్ల సంఖ్యలో గణనీయమైన మార్పులు కనిపిస్తే, ఇప్పటివరకు ఉన్న రాజకీయ సమీకరణాల్లో కూడా కొంత మార్పు వచ్చే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. అయితే ఈ మార్పులు చివరికి ఎన్నికల ఫలితాలపై ఎంత ప్రభావం చూపుతాయి? ఆంధ్రా సెటిలర్స్ ఓటర్లు నిజంగా హైదరాబాద్ నుంచి తగ్గిపోయారా? ఏ పార్టీకి ఎక్కువగా నష్టం జరుగుతుంది? ఎవరికైనా రాజకీయంగా లాభం కలుగుతుందా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం తుది ఓటర్ల జాబితా వెలువడిన తర్వాతే లభించనుంది.



## ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు

ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే మాత్రం ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రీ సర్వే చేపడుతోందని తెలిపారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు. పట్టణాలు, నగరాల్లో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌లో ప్రయోగాత్మకంగా టవర్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేద కుటుంబాలపై నిర్మాణ భారం తగ్గించడంతో పాటు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. 43వ డివిజన్‌లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో అందుతున్నాయా, నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారుల సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొంటూ, నూతన గృహ ప్రవేశం చేసుకున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వస్త్రాలను బహూకరించారు. చివరి దశలో ఉన్న ఇళ్లను కూడా పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐడీఓసీని ఆనుకుని నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిధుల కొరత లేదని, పనులు పూర్తయిన 24 గంటల్లోనే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ భవన సముదాయాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి హౌసింగ్ శాఖకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్య పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. మరో వారం, పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని మంత్రి వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లను కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం అయ్యే వరకు విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో పేదలకు తగిన స్థాయిలో ఇళ్లు నిర్మించలేదని విమర్శించిన మంత్రి, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, హౌసింగ్ శాఖ ఎండీ గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల్ కళాశాలలో జరిగిన అభివృద్ధి కార్యక్రమం

**జయభేరి, ఘట్కేసర్ :**

MMC ఘట్కేసర్ సర్కిల్ గురుకుల్ కళాశాల లో జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గురుకుల్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు నిర్మించిన వాష్ రూమ్ లను పలు అభివృద్ధి కార్యక్రమల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి విచ్చేసి ఆయన మాట్లాడుతూ గురుకుల్ కళాశాల అభివృద్ధికి పాటుపడుతున్న గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. గురుకుల్ జూనియర్ కాలేజీ ను కేజీ టూ పీజీ వరకు ఏర్పాటు చేయడానికి నా శాయశక్తుల ప్రయత్నిస్తానని ప్రస్తుతం జూనియర్ కళాశాలలో అధ్యాపకుల కొరత వలన అనుకున్నంత విద్యాభ్యశించకపోవడం ఇట్టి పరిస్థితిని ప్రభుత్వంతో చర్చించి త్వరలో ముఖ్యమంత్రి కలిసి ఇట్టి విషయాన్ని చెప్పి ఈ గురుకుల కళాశాల ను ఎండోమెంట్ నుండి ప్రభుత్వం స్వాధీనం తీసుకునేటట్టు ముఖ్యమంత్రితో మాట్లాడి చేయిస్తానని. ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం నెలకొన్న అధ్యాపకుల కొరతను ఇంటర్మీడియట్ కమిషనర్ గారితో మాట్లాడి పరిష్కరిస్తానని తన వంతు గురుకుల్ అభివృద్ధికి సహాయ సహకారం అందిస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలు అధికార పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి రాకపోవడం స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాకపోవడంతో వారికి అభివృద్ధిపై ఎంత ధ్యాస ఉందో ప్రజలు అనుకోవడం చర్చ న్యాంశం గా మారింది. అదేవిధంగా లాల్ బహదూర్ స్మారక యువజన సంఘం వారు గురుకుల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కు ఇంటర్ మొదటి సంవత్సరం లో ఉత్తీర్ణులైన వారిలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి 5000 రూపాయలు నగదు బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరూ గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు వారు చేస్తున్న పనులను అభినందించారు. సభ్యులకు శాలువాతో సత్కరించారు.



ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బండారి శ్రీనివాస్ గౌడ్. ఏనుగు సుదర్శన్ రెడ్డి. గురుకుల్ పరిరక్షణ సమితి GPS సభ్యులు. మాజీ జడ్పిటిసి సింగిరెడ్డి రామిరెడ్డి. జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మి రెడ్డి. టిడిపి పార్టీ అధ్యక్షులు వేముల సంజీవ గౌడ్. బిజెపి పార్టీ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి. లాల్ బహదూర్ స్మారక యువజన సంఘం అధ్యక్షులు బ్రహ్మంగారు. గురుకుల్ వాకర్ అసోసియేషన్ సభ్యులు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు. బిజెపి పార్టీ నాయకులు. యువజన సంఘాల నాయకులు. గురుకుల్ ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి. అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు గురుకుల్ పూర్వ విద్యార్థులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## భారతి సిమెంట్ విక్రయాల్లో వరుసగా 12వ సారి తెలంగాణ స్టేట్ టాపర్‌గా సవేరా ఏజెన్సీస్

**జయభేరి, మేడిపల్లి :**

భారతి సిమెంట్ విక్రయాల్లో సవేరా ఏజెన్సీస్ మరో అరుదైన ఘనతను సాధించింది. వరుసగా 12 సంవత్సరాల పాటు తెలంగాణ రాష్ట్రస్థాయిలో టాప్ సేల్స్ పెర్ఫార్మర్‌గా నిలిచి, తన సత్తాను మరోసారి చాటుకుంది. 2026 ఆగస్టు 21న స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో నిర్వహించిన ఆఫ్‌సైట్ బిజినెస్ రివ్యూ మీట్ సందర్భంగా సవేరా ఏజెన్సీస్‌కు తెలంగాణ స్టేట్ టాపర్ అవార్డును ప్రదానం చేశారు. భారతి సిమెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్ హరీష్ కామర్తి, వైస్ ప్రెసిడెంట్ - సేల్స్ కొండల్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును సవేరా ఏజెన్సీస్ ప్రతినిధులు అందుకున్నారు. ఈ సందర్భంగా సవేరా ఏజెన్సీస్ భాగస్వాములు తీగల శంకర్ రెడ్డి - స్వప్న, జక్క వెంకట్ రెడ్డి - క్రాంతి మాట్లాడుతూ, ఈ ఘనత తమ సంస్థపై నమ్మకం ఉంచిన కస్టమర్లు, డీలర్లు, భాగస్వాములు మరియు సంస్థ ఉద్యోగుల సమిష్టి కృషి ఫలితమని తెలిపారు. వరుసగా 12 సంవత్సరాల పాటు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలవడం ఎంతో గర్వకారణమని, భవిష్యత్తులోనూ ఇదే నిబద్ధత, నాణ్యత మరియు సేవా దృక్పథంతో మరిన్ని విజయాలు సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సవేరా ఏజెన్సీస్‌కు లభించిన ఈ ఘనత పట్ల పలువురు అభినందనలు తెలిపారు.



## గ్రామంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**జయభేరి, సైదాపూర్ :**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలోని దుద్దెనపల్లి గ్రామంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్న ఏ ఎస్సై సంపత్ రెడ్డి. ఈ మేరకు పోలీసులు నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. ఒకపక్క పోలీసులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ, మరోవైపు మందుబాబులు ఇవేమీ తమకు పట్టునట్లుగా వ్యవహరిస్తూ తనిఖీల్లో పట్టుబడుతున్నారు. యథేచ్ఛగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో వాహనదారులు పట్టుబడుతున్నారు. వారిపై సంబంధిత పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నారు. కోర్టు వారికి భారీగా జరిమానాలు విధించడంతోపాటు జైలుశిక్ష సైతం విధిస్తున్నది. అయినా మందుబాబులు తమ తీరును మార్చుకోవడంలేదు. నిత్యం తనిఖీలు కొనసాగుతుండగా, మరోవైపు వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడుపుతునే ఉన్నారు.

## సీపీఐ జిల్లా సమితి సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు కన్నుమూత



**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 22 :**

సీపీఐ జిల్లా సమితి సభ్యుడు, ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు (50) అనారోగ్యంతో మృతిచెందాడు. సిపిఐ కార్యకర్తల సందర్శనార్థం సిపిఐ పార్టీ కార్యాలయం వద్ద ఆయన పార్థివ దేహం ఉంచారు. అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం వారి స్వగ్రామం నల్గొండ జిల్లా నాంపల్లి మండలం పసునూరు గ్రామంలో జరుగుతాయి. కామ్రేడ్ గోరేటీ రాములు గత 26 సంవత్సరాలు విద్యార్థి,యువజన ప్రజానాట్యమండలి ప్రస్తుతం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. 2014 సంవత్సరంలో దాతార్ పల్లి గ్రామ ఎంపిటీసీ గా పోటీ చేశారు. ఆయనకు ఒక్క కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారి మరణం కమ్యూనిస్టు పార్టీకి కార్మిక వర్గానికి తీరని లోటు అని పలువురు సంతాపం తెలిపి విప్లవ జోహార్లు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## లండన్‌లో అంబేద్కర్ హౌస్‌ను సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్ :**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి లండన్‌లోని ప్రసిద్ధ అంబేద్కర్ హౌస్‌ను సందర్శించారు. 1921-22 కాలంలో బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నివసించిన 10 కింగ్ హెన్రీ'స్ రోడ్, ప్రింరోజ్, లండన్ చిరునామా ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన చారిత్రక ప్రదేశంగా నిలిచింది. అంబేద్కర్ హౌస్ సందర్శనను ఒక తీర్థయాత్రగా అభివర్ణించిన సీఎం రేవంత్ రెడ్డి, సందర్శకుల డైరీలో తన అనుభూతిని నమోదు చేస్తూ, "డాక్టర్ అంబేద్కర్ హౌస్‌ను సందర్శించడం ఒక తీర్థయాత్ర లాంటిది. ఈ స్ఫూర్తి జీవితాంతం నిలిచిపోతుంది. సామాజిక న్యాయం కోసం నా అంకితభావం మరింత పునరుద్ధరించబడింది" అని రాశారు. డాక్టర్ అంబేద్కర్ ఆశయాలైన రాజ్యాంగబద్ధత, సమానత్వం, కుల రహిత సమాజం, అణచివేత లేని వ్యవస్థ, సామాజిక న్యాయానికి అత్యున్నత ప్రాధాన్యత వంటి విలువలకు అంబేద్కర్ హౌస్ ప్రస్తుతం మ్యూజియంగా అంకితం చేయబడింది. దాదాపు గంటపాటు సాగిన సందర్శనలో అంబేద్కర్ మ్యూజియం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన యాంటీ కాస్ట్ డిస్క్రిమినేషన్ అలయన్స్ (ACDA) చైర్‌పర్సన్ సంతోష్ దాస్ MBE, బాబా సాహెబ్ బ్రిటన్‌లో గడిపిన కాలం, ఆయన జీవితంలోని వివిధ అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. సందర్శన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి గారు స్పందిస్తూ, "నా జీవితంలోని గొప్ప క్షణాల్లో ఇది ఒకటి. అత్యంత గొప్ప భారతీయుల్లో ఒకరైన బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక చారిత్రక అంశాన్ని చూడటం, తాకడం ఎంతో గొప్ప అనుభూతి" అని పేర్కొన్నారు.



## కొనసాగుతున్న నిత్యపూజలు

- శ్రీలక్ష్మీ నరసింహా స్వామి నిత్యరాబడి రూ.22.45 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో నిత్యపూజలు కొనసాగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి శనివారం నిత్యరాబడిలో భాగంగా రూ.22,45,433 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,83,700, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,96,500, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.2,81,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.1,79,250, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,00,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.55,316, ప్రసాద విక్రయం ద్వారా రూ.7,76,880, కల్యాణకట్ట ద్వారా రూ.62,900తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



## సురవరం పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

**జయభేరి, యాదగిరిగుట్ట :**

అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి,ఆయన పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా యాదగిరిగుట్ట బస్టాండ్ ఎదురుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై పోరాటాల్లో పాల్గొని, ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ వంటి విద్యార్థి, యువజన ఉద్యమాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారన్నారు. విద్యార్థుల సమస్యలు, విద్యా సౌకర్యాలు,ఉపాధి, యువత హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలను నిర్మించడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారన్నారు.



నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ సమస్య,రైతుల ఇబ్బందులు, కార్మికుల హక్కులు, పేదల సమస్యలు తదితర అంశాలను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. సురవరం సుధాకర్ రెడ్డి నిరాడంబర జీవితం, ప్రజలతో మమేకమైన తీరు, కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల అచంచలమైన నిబద్ధత, ప్రజా ఉద్యమాల పట్ల అంకితభావం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోద శ్రీరాములు,జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ,బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, ఎండి ఇమ్రాన్,మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్,మర్రిగుడెం సర్పంచ్ బోధాసు స్వప్న జగన్, మాజీ కోఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య,సిపిఐ నేతలు పేరబోయిన బంగారి, గోపగాని రాజు,మునుకుంట్ల నరసమ్మ,ఆరే పుష్ప, ముక్కెర్ల పెంటయ్య, మద్దూరి భాగ్యమ్మ, తోటకూరి శేఖర్,చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠధామం వరకు సిసి రోడ్ నిర్మాణ పనులు



**జయభేరి, సైదాపూర్ :**

సైదాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి గారు మండలంలోని గొల్లగూడెం గ్రామంలో అంబేద్కర్ చౌరస్తా నుండి వైకుంఠధామం (శ్మశాన వాటిక) వరకు సిసి రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల మౌనికసంపత్, ఉప సర్పంచ్ దుస్స కుమార్, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కొంరయ్య, మాజీ సర్పంచ్ కొమురయ్య, వార్డు మెంబర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగ జేఏసీ సన్నాహక సమావేశం



**జయభేరి, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 22 :**

యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగ,ఉపాధ్యాయ గెజిటడ్ కార్మిక పెన్షనర్ల సమస్యల పరిష్కరణ కోసం చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాలని విజయవంతం చేసేందుకు కలెక్టర్ కార్యాలయంలో సన్నాహక సమావేశ కార్యక్రమాన్నినిర్వహించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పదేపదే హామీ ఇస్తున్నా సమస్యల అమలుకు నోచుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, అందుకే ఉద్యోగులు నేడు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్యం పూర్తిస్థాయిలో అమలు చేయాలని,పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని,ఉద్యోగులకు రావలసిన 6 పెండింగ్ డీఏలను ఒకేసారి విడుదల చేయాలని,నూతన పెన్షన్ విధానంను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను వెంటనే అమలు పరచాని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎం.డి.ఖదీర్, కె.శ్రీకాంత్, పెండెం శ్రీనివాస్,కె.మోహన్ రెడ్డి,అమరేందర్ రెడ్డి, ఎం.యాదయ్య,ఆర్.శైలజా, కె.ఆనంద్,ఎం.డి.అజీజ్ అలీ ఖాన్, పి.శ్రీకాంత్ రెడ్డి, వి.అశోక్ కుమార్,కె.వినోద్ రెడ్డి,మొయిజున్నిసా బేగం, ఎన్.లక్ష్మీ నరసింహ రెడ్డి, మెహతాబ్ సైదులు,గణగాని శశికాంత్ గౌడ్,పి.శ్రీకాంత్, బి.శ్రీనివాస రాజు,బోయ రాములు,జి.లింగయ్య, జి. శ్రీనివాస్,కె.రమేష్, వి. నరేందర్,కె.యశోద, ఎం. కృష్ణ,బి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.





## వార్డు సభ్యుడు వానరాసి స్వామికి మరో ఉన్నత పదవి

- ఫరూక్ నగర్ మండల వార్డు సభ్యల ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవం
- ప్రజల సేవకు మరింత బాధ్యత పెరిగిందన్న వానరాసి స్వామి

**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 22 :**

నాగులపల్లి గ్రామ వార్డు సభ్యుడు వానరాసి స్వామికి మరో ఉన్నత పదవి. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం వార్డు సభ్యుల మండల ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన స్వామి. శనివారం సాయి కృష్ణ ఫంక్షన్ హాల్ లో జరిగిన వార్డు సభ్యుల సమావేశంలో కీలక పదవి. వార్డు సభ్యునిగా బాధ్యతలు చేపడుతూ మరో ఉన్నతమైన పదవి రావడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన వానరాసి స్వామి. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.....గత ఎన్నికల నుండి పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసి గెలుపే దిశగా పనిచేస్తున్న నన్ను మరో ఉన్నతమైన పదవికి ఎన్నిక చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా వార్డు సభ్యునిగా నాగులపల్లి గ్రామానికి అన్ని విధాల అభివృద్ధి చేస్తూ ప్రజలకు అండగా ఉంటాననీ అన్నారు. మండల ఉపాధ్యక్షునిగా మరో ఉన్నత ఆలోచన విధానాలతో ప్రజా సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. మనం మంచి చేస్తూ సమాజంలో మార్పు కోసం ప్రయత్నిస్తుంటే అవకాశాలు ఎన్నో లభిస్తాయని తన విషయంలో కూడా అదే జరిగిందని అన్నారు. నిరంతరం తనకున్న బాధ్యతను మరింత రెట్టింపు ఉత్సాహంతో ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**జయభేరి, పరకాల, ఆగష్టు 22:**

పరకాల పట్టణ కేంద్రంలోని రాజుపేట లో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి అయుబ్ తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ పాఠశాల ద్వారా స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు.నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, సమయానికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మేమే చేస్తాం అని అన్నారు.

## పేద విద్యార్థులకు అండగా ఆర్.ఆర్. ఫౌండేషన్

- విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ చేసిన రాఘవేందర్ గౌడ్



**జయభేరి, మేడ్చల్:**

పేద విద్యార్థులకు అండగా ఆర్.ఆర్. ఫౌండేషన్ ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ రామన్నగారి రాఘవేందర్ గౌడ్ తెలిపారు. శనివారం మేడ్చల్ 297వ డివిజన్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠశాల యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆర్.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ అధినేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్వయంగా యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ప్రోత్సాహానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందించడమే లక్ష్యంగా ఆర్.ఆర్. ఫౌండేషన్ కార్యక్రమాలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కటిక వినయ్, శ్రీనాథ్ ముదిరాజ్ (అవతార్), రఘు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్.ఆర్. ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పాత దేవతా విగ్రహాలకు గౌరవప్రదమైన వీడ్కోలు

- పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా జీహెచ్ఎంసీ వినూత్న కార్యక్రమం
- గుండ్లపోచంపల్లి డివిజన్ లో 'ప్రాజెక్ట్ ఉద్వాసన
- డిప్యూటీ కమిషనర్ సుధాంష్

**జయభేరి, మేడ్చల్:**

పాత దేవతా విగ్రహాలు, చిత్రపటాలను నిర్లక్ష్యంగా చెత్తకుప్పల్లో, కాలువలు, చెరువుల్లో పడవేయకుండా జీహెచ్ఎంసీ సిబ్బందికి అప్పగించాలని మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంష్ సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు గౌరవం కల్పించాలనే ఉద్దేశంతో జీహెచ్ఎంసీ చేపట్టిన 'ప్రాజెక్ట్ ఉద్వాసన' కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పాతవి, దెబ్బతిన్నవి, వినియోగానికి అనర్హంగా మారిన దేవతా విగ్రహాలు, చిత్రపటాలను చెత్తకుప్పల్లో లేదా చెరువుల్లో పడవేయకుండా గౌరవప్రదంగా సేకరించి పర్యావరణహిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడమే ప్రధాన ఉద్దేశంతో జిహెచ్ఎంసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శనివారం మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ 'ప్రాజెక్ట్ ఉద్వాసన' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో






డిప్యూటీ కమిషనర్ సుధాంష్ పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ పాత దేవతా విగ్రహాలు, చిత్రపటాలను నిర్లక్ష్యంగా చెత్తకుప్పల్లో, కాలువలు, చెరువుల్లో పడవేయకుండా జీహెచ్ఎంసీ సిబ్బందికి అప్పగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల మనోభావాలు, సంప్రదాయాలకు గౌరవం కల్పించడమే 'ప్రాజెక్ట్ ఉద్వాసన' లక్ష్యమన్నారు. నీటి వనరుల్లో విగ్రహాలు, ఇతర పూజా సామగ్రిని వేయడం వల్ల కాలుష్యం ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై పాత దేవతా విగ్రహాలు, చిత్రపటాలను ప్రత్యేకంగా సేకరించే వ్యవస్థకు అందించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతో 'ప్రాజెక్ట్ ఉద్వాసన'ను మరింత విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ విజయలక్ష్మి, శానిటేషన్ అధికారి భాస్కర్, నర్సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్, అమరం జైపాల్ రెడ్డి, నాయకులు గడిలా కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి, దొడ్ల మధుసూదన్, విక్రమ్, ఉదయ్ గౌడ్, సిబ్బంది ప్రభాకర్, కిరణ్, శివ, భాను తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుంటే ఉపేక్షించం

- ఏసీపీ భాస్కర్ గౌడ్
- గుండ్లపోచంపల్లిలో టౌన్ ప్లానింగ్ అధికారులు.. కూల్చివేతలు

**జయభేరి, మేడ్చల్:**




అక్రమ నిర్మాణాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని మేడ్చల్ సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) భాస్కర్ గౌడ్ స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపడితే వాటిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారి సాయి తేజతో కలిసి అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. గుండ్లపోచంపల్లి ప్రధాన రహదారి వెంట ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను జేసీబీల సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టే ముందు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే వాటిని గుర్తించి కూల్చివేయడంతో పాటు బాధ్యులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రధాన రహదారులు, ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రాంతాలు, ప్రభుత్వ స్థలాలు, అనుమతులు లేని ప్రాంతాల్లో నిర్మాణాలను చేపడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. భవిష్యత్తులోనూ టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రజలు కూడా అక్రమ నిర్మాణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని ముందుగానే పరిశీలించుకుని పనులు ప్రారంభించాలని, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టి తరువాత ఇబ్బందులు ఎదుర్కోవద్దని సూచించారు. పట్టణ అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టినప్పుడే ప్రజలకు మౌలిక వసతులు సక్రమంగా అందడంతో పాటు ట్రాఫిక్, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని, నిబంధనల అమలులో అధికారులు కఠినంగా వ్యవహరిస్తారని తెలిపారు. గుండ్లపోచంపల్లి ప్రాంతంలో చేపట్టిన ఈ కూల్చివేతలతో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారికి అధికారులు గట్టి హెచ్చరికలు జారీ చేసినట్లయింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే నిర్మాణ దశలోనే గుర్తించి చర్యలు తీసుకునేలా తనిఖీలను మరింత ముమ్మరం చేయనున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.





## డంపింగ్ యార్డ్ ను తలపిస్తున్న సుక్కమ్మ బస్తి

- పండుగ వాతావరణంలో విపరీతమైన చెత్త దుర్గంధం వాసనతో భక్తుల తిప్పలు

**జయభేరి, జవహర్ నగర్ :**

జవహర్ నగర్ మున్సిపాలిటీ ప్రాంతంలో బోనాల జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న జాతర సమయంలో సుక్కమ్మ కుంట ప్రాంతం అపరిశుభ్రతతో కూడిన డంపింగ్ యార్డ్ ప్రాంతంగా దర్శనమిస్తోంది విపరీతంగా పేరుకుపోయిన ఈ చెత్తను తొలగించాలని మున్సిపాలిటీ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన చెత్త తొలగింపు విషయంలో నిర్లక్ష్యం వహించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు పేరుకుపోయిన ఈ చెత్త నుండి దుర్గంధపు వాసన విరజిమ్మడంతో పాటు ఈగలు దోమలు క్రిమి కీటకాలకు ఆవాసంగా మారి స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకొని చెత్తను తొలగించి స్థానికులు అనారోగ్యాల బారిన పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని లేనియెడల తాగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.

## ఏడేళ్ళ అధిర ప్రేమాని ఇందర్ చెస్ 960లో నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం

- 210 ఫజిల్స్ చెస్ లో అద్వితీయ ప్రతిభ




ఏడేళ్ళ చిన్నారి అధిర ప్రేమాని ఇందర్ చెస్ క్రీడ లో నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సృష్టించింది. జూబ్లీహిల్స్ లోని జూబ్లీ హిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్లో లెర్నోరమా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆద్వర్యంలో ఏకాగ్ర చెస్ అకాడమీలో శిక్షణ పొందిన అధిక ప్రేమాని 15 సైమంటేనియస్ చెస్960 గేమ్స్, 210 చెస్ ఫజిల్స్ చెస్ లో క్రీడాకారులతో ఆడి నోబుల్ వరల్డ్ రికార్డ్ ను సృష్టించింది. చీఫ్ అజ్జుడికేటర్ చొక్కలింగం బాలాజీ, చీఫ్ ఆర్బిటర్ సుబ్బరాజులు చెస్ లో అధిర అద్భుత ప్రతిభను తిలకించి నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు కల్పించారు. ఈ చెస్ క్రీడలకు ఉమెన్ గ్రాండ్ మాస్టర్ బొడ్డ ప్రత్యూష హాజరై అధిర చెస్ ఆటను తిలకించి అభినందించింది. నోబుల్ రికార్డ్స్ సృష్టించిన విజయం పట్ల కోచ్ చైతన్య, సందీప్ నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. గ్రాండ్ మాస్టర్ కావడమే తన లక్ష్యమని, తల్లిదండ్రులు ప్రేమ, మణిఇందర్, కోచ్ చైతన్యల ప్రోత్సాహం వల్లే ఇందంతా సాధ్యమైందని అధిర పేర్కొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలి

- నరేష్

**జయభేరి, మేడ్చల్:**



అడ్డాలపై పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు సీఐటీయూ అనుబంధ బీసీడబ్ల్యూ (BCW) యూనియన్ ఆధ్వర్యంలో లేబర్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీఐటీయూ మేడ్చల్ మండల కమిటీ తెలిపింది. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న ప్రతి కార్మికుడు లేబర్ కార్డు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు లేబర్ కార్డు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్డు ఉన్న కార్మికుడు ప్రమాదానికి గురై మృతి చెందితే లేబర్ డిపార్ట్ మెంట్ నుంచి రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతుందని పేర్కొన్నారు. సహజ మరణానికి రూ.2 లక్షలు, కార్డు కలిగిన కార్మికుడి కుమార్తె వివాహానికి రూ.30 వేల ఆర్థిక సహాయం, పిల్లల ప్రసవ సమయంలో రూ.30 వేల సహాయం, అంగవైకల్యానికి రూ.50 వేల వరకు ఆర్థిక సహాయం వంటి ప్రయోజనాలు లభిస్తాయని వివరించారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలంటే ప్రతి భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డు తప్పనిసరిగా పొందాలని నరేష్ కోరారు. లేబర్ కార్డు దరఖాస్తులు, ఇతర వివరాల కోసం 9951408268, 7569266582, 7993929594 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీడబ్ల్యూ యూనియన్ జిల్లా నాయకులు అశోక్, మండల నాయకులు ఎన్. కృష్ణ, జి. శ్రీను, స్వామి, చి. కృష్ణ, ఎల్లం, ఎల్లయ్య, అస్తరమ్మ, రజిని, సుతారి గూడా శ్రీను, అనిత తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ నాటికి గోదావరి జలాలు

**జయభేరి, విశాఖపట్టణం :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుస్థిర పారిశ్రామికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సురక్షిత తాగునీరు సరఫరాలను సమతుల్యం చేస్తూ కూటమి ప్రభుత్వం సువర్ణ అధ్యాయానికి చుట్టబోతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల దాహార్తిని తీరుస్తూ, రాబోయే సెప్టెంబర్ మొదటి వారంలో అనకాపల్లి, విశాఖ పట్నం జిల్లాలకు పవిత్ర గోదావరి జలాలు రప్పిస్తామని అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అనకాపల్లి జిల్లా కే. కోటపాడు మండలం ఏ కోడూరు గ్రామంలో నిర్వహించిన బహిరంగ ప్రజావేదిక సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఉత్తారంధ్ర సమగ్ర అభివృద్ధికి సంబంధించిన భవిష్యత్ కార్యాచరణను ప్రజల ముందు పెట్టారు. అనకాపల్లిని కేవలం ఒక సంప్రదాయ బెల్లం మార్కెట్‌గా మాత్రమే కాకుండా దేశంలోని అగ్రగామిగా నిలిచే నంబర్ వన్ పారిశ్రామిక సామ్రాజ్యంగా తీర్చిదిద్దే బాధ్యతను తాము భుజానికి ఎత్తుకున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వంటి అంతర్జాతీయ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను తీసుకు వస్తుంటే కొందరు స్వార్థ రాజకీయ శక్తులు చేస్తున్నప్పుడు తప్పుడు ప్రచారాలను ఆయన తనదైన శైలిలో తిప్పి కొట్టారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూసే శక్తులు ఎన్ని కుట్రలు చేసినా ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వ ప్రయాణం సాగుతుందని తేల్చి చెప్పారు.

# ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి ఉద్యమ బాట.. 27న మహా ధర్నా



జయభేరి, భువనగిరి, ఆగస్టు 22:
ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27న కలెక్టర్ కార్యాలయం ఎదుట మహా ధర్నాను నిర్వహిస్తున్నట్లు ప్రతి ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఉద్యోగ జేఏసీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పదేపదే హామీ ఇస్తున్న సమస్యల అమలుకు నోచుకోలేక అనేకసార్లు వేచి చూసి చివరికి ముఖ్యమంత్రి స్వయంగా ఉద్యోగ సంఘాలను పిలిచి సుమారు మూడు గంటల పాటు చర్చలు జరిపి స్వయంగా హామీ ఇచ్చినప్పటికీని నేటి వరకు ఎలాంటి అమలుకు నోచుకోలేదని అన్నారు. అందువల్లనే ఉద్యోగులు నేడు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి పిలుపు నివ్వడం జరిగిందని అన్నారు. ఉద్యోగ నగదురైత వైద్యం ఈ హెచ్ ఎస్ పూర్తిస్థాయిలో అమలు జరపాలని, ముఖ్యమంత్రి హామీ మేరకు పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని, ఉద్యోగులకు రావలసిన ఆరు పెండింగ్ డీఏలను ఒక్కసారి, ఏక మొత్తంలో విడుదల చేయాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు పరచాలని ఉద్యోగులకు పెన్షనర్లకు రావలసిన పెండింగ్ బిల్లులను ఏకకాలంలో ఏక మొత్తంలో విడుదల చేయాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, జీవో 190 ను అన్ని శాఖల్లో అమలు పరచాలని, ఇట్టి సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. ఇట్టి ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఈనెల 27 ఉదయం 10:30కు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వేలాదిమంది ఉద్యోగులతో మహాధర్నా నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు పరచాలని కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సన్నాక సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వము, ముఖ్యమంత్రి పై సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి జి ఈ జెఏసి జిల్లా కో చైర్మన్ పెండెం శ్రీనివాస్, ఎండి ఖాదర్, కే.శ్రీకాంత్, ఎమ్మార్వో కృష్ణ, కే.మోహన్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, ఎం యాదయ్య, ఆర్ శైలజ, కే ఆనంద్, ఎండి ఖజీజ్ అలీ ఖాన్, పి శ్రీకాంత్ రెడ్డి, వి అశోక్ కుమార్, కె వినోద్ రెడ్డి ,మోయిజున్నిస బేగం, ఎన్ లక్ష్మీ నరసింహారెడ్డి, మెహతాబ్, సైదులు, ఘనగాని శశికాంత్ గౌడ్, పి శ్రీకాంత్, బి శ్రీనివాసరాజు, బోయ రాములు, జి లింగయ్య, జి శ్రీనివాస్, కే రమేష్, వి నరేందర్, కె యశోద, ఎం కృష్ణ, బి బాలరాజు, తదితర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఘనంగా గాయత్రీ యజ్ఞం, భక్తురాలికి చీర పంపిణీ

జయభేరి, కొండమల్లపల్లి :
గాయత్రీ జపంతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని ప్రతి ఒక్కరూ గాయత్రి జపాన్ని ఆచరించాలని అఖిల విశ్వ గాయత్రీ పరివార్ కొండమల్లేపల్లి సభ్యులు నూతనగంటి జగన్ అన్నారు. శనివారం కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరు యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏకకుండే గాయత్రీయజ్ఞాన్ని ఆయన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి భక్తులు రావాలని ఆలయం అభివృద్ధి చెందాలని ప్రతి శనివారం గాయత్రీ యజ్ఞం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతిరోజు ఆలయంలో పూజా కార్యక్రమాలు చేపట్టడం శుభ పరిణామం అన్నారు. యజ్ఞంలో పాల్గొన్న భక్తులకు లాటరీ ద్వారా బుజ్జమ్మ అనే భక్తురాలికి దుర్గామాత అమ్మవారి చీరను అందజేశారు. యజ్ఞంలో పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి శనివారం శ్రీ ఆంజనేయ స్వామి దుర్గామాత ఆలయం వద్ద 11 గంటలకు గాయత్రీ యజ్ఞం ఉంటుందని భక్తుల అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, తోటపల్లి కృష్ణ, నడ్డి శంకర్, జయ , లచ్చి రామ్ నాయక్ , నాగార్జున రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

## సుధాకర్ రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి



జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 22:
సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఐ మండల కార్యదర్శి సిల్వేరు దుర్గయ్య అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే వామపక్షాల వైపు ఆకర్షితులై విద్యార్థి యువజన సమస్యలతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేశారని అన్నారు. కమ్యూనిస్టులు ఈ దేశంలో ఏకం కావాలని అవసరం ఉందని చెప్పినటువంటి నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో వల్లపు భగవంతు, పకీర నాయక్ పాల్గొన్నారు.



## ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం

- దిగ్విజయంగా పూర్తి అయిన ఐదవ వారం
- హనుమాన్ చాలీసా పారాయణం శక్తివంతమైనది... పురోహితులు పాల సదాశివశర్మ

జయభేరి, కొండమల్లేపల్లి :
కొండమల్లేపల్లి పట్టణంలోని ప్రముఖ దేవాలయం శ్రీ సీతారామ చంద్రమౌళీశ్వర ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఉదయం హనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ పురోహితులు పాల సదాశివశర్మ ఆంజనేయ స్వామి విగ్రహా నికి అభిషేకం ,అలంకరణ చేశారు. అనంతరం భక్తులను ఆశీర్వదించి ప్రదక్షిణలు చేయించారు. హనుమాన్ ఆలయం ముందు భక్తులు కూర్చుని భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు. హనుమాన్ చాలీసా పారాయణం ప్రతిరోజు పఠించడం వలన మంచి జరుగుతుందని అన్నారు. ప్రతి శనివారం జరిగే ఈ బృహత్తర కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈరోజు భక్తులు ఎక్కువగా పాల్గొన్నందుకు సంతోషంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల పరమేశ , ఏరుకొండ రాము, దాచేపల్లి వెంకటేశ్వర్లు, నేలంటి వెంకటేశ్వర్లు, చెన్నుపాటి శ్రీహరి గోపాల చారి, తడకమల్ల శ్రీనివాస్ ,నూతనగంటి జగన్, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి ,ఉప్పల నారాయణ, బొడ్డుపల్లి శ్రీనివాస్, భాస్కర్, గణేష్, మంజుల, జయ, వెంకటయ్య, యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి

- విద్యార్థుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి
- షాద్‌నగర్‌లో ఆర్డీఓ కార్యాలయం ముట్టడి విద్యార్థుల ఆందోళన
- ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్
- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్



జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 22 :
షాద్‌నగర్ నియోజకవర్గంలో పాలిటెక్నిక్ విద్యను కాపాడాలని, విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని "పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి - విద్యార్థుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి" అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విద్యార్థుల ఆందోళన కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు విద్యార్థులను అక్కడి నుంచి తరలించారు.
అనంతరం ఆర్డీఓ స్వయంగా విద్యార్థుల వద్దకు వచ్చి వారి సమస్యలను విన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఎలాంటి నిర్ణయాలను విద్యార్థి సంఘాలు అంగీకరించబోవని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించే వరకు విద్యార్థుల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు.. పాలిటెక్నిక్ విద్యార్థి, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జర్నలిస్ట్‌పై ఆర్టీసీ డ్రైవర్ దాష్టీకం వ్యాలిడ్ పాస్ ఉన్నా బలవంతంగా టికెట్ జారీ

- డిఎంకి ఫిర్యాదు చేసిన రాజ్ న్యూస్ రిపోర్టర్ మణికంఠ



జయభేరి, దేవరకొండ :
చెల్లుబాటు అయ్యే జర్నలిస్ట్ బస్ పాస్ ఉన్నప్పటికీ ఆర్టీసీ సిబ్బంది దౌర్జన్యంగా ప్రవర్తించి టికెట్ ఛార్జీ వసూలు చేసిన సంఘటన దేవరకొండ డిపో పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... రాజ్ న్యూస్ దేవరకొండ నియోజకవర్గ రిపోర్టర్ సంకోజు మణికంఠ (శుక్రవారం) మాల్ నుండి దేవరకొండకు e డిలక్స్ బస్సులో ప్రయాణించారు. ఈ క్రమంలో తన వద్ద ఉన్న ప్రభుత్వం జారీ చేసిన "డిస్ట్రిక్ట్ జర్నలిస్ట్ పాస్"ను డ్యూటీలో ఉన్న బస్సు డ్రైవర్/సిబ్బందికి చూపించారు. అయితే, జర్నలిస్ట్ ఉచిత పాస్ నియమాలపై తనకు అవగాహన లేదని, 1/3 వంతు టికెట్ తీసుకోవాల్సిందేనని డ్రైవర్ దౌర్జన్యంగా మాట్లాడారు. జర్నలిస్ట్ ఎంత చెప్పినా వినకుండా బలవంతంగా పాస్ నంబర్ నమోదు చేసి రూ. 50/ టికెట్ ఇష్యూ చేశారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం అందించిన గుర్తింపు కార్డును తిరస్కరించడమే కాకుండా, ప్రయాణికుడి పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సదరు ఆర్టీసీ సిబ్బందిపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మణికంఠ దేవరకొండ డిపో మేనేజర్ (DM) కి రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు. జర్నలిస్టులకు ప్రభుత్వం కల్పించిన ఉచిత ప్రయాణ హక్కును కాలరాసే విధంగా ప్రవర్తించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆర్టీసీ సిబ్బందికి జర్నలిస్ట్ పాస్సుల నిబంధనలపై అవగాహన కల్పించాలని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు డిమాండ్ చేశారు.





## అటెన్షన్ డైవర్షన్ కేసులో నిందితులు అరెస్టు

జయభేరి, కూకట్ పల్లి :
కేపీహెచ్బీ పోలీస్ స్టేషన్ పరిధి 9వ ఫేజ్ ఎస్బీఐ ఏటీఎం వద్ద దృష్టి మరల్చి నగదు మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడు విద్యాసాగర్ ను పోలీసులు అరెస్టు చేసారు. 2 లక్షల నగదుతో వచ్చిన 56 ఏళ్ల ఉపాధ్యాయురాలికి సహాయం చేస్తానంటూ నిందతుడు మోసం చేసినట్లు నిర్ధారించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేసారు. నెక్సస్ మాల్ సమీపంలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 70 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడి విద్యా సాగర్ పై గతంలోనే 19 కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

## అమ్మవారి విగ్రహం మాయం

జయభేరి, హైదరాబాద్ :
చంపాపేట్లోని కటికొనుకుంట ప్రాంతంలో అమ్మవారి ఆలయంలో విగ్రహం మాయమైన ఘటన కలకలం రేపుతోంది. ఆలయంలో ఉన్న అమ్మవారి విగ్రహం కనిపించకపోవడంతో ఆలయ నిర్వాహకులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. విగ్రహం ఎలా మాయమైంది? ఎవరైనా అపహరించారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆలయం పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.


# గ్రామాల్లో వర్షపాతం తక్కువ ఉన్నందున చెట్ల పెంపకం చేపట్టాలి



జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 22:
గ్రామాల్లో వర్షపాతం తక్కువ ఉన్నందున చెట్ల పెంపకం చేపట్టాలని డిఆర్డిఓ నాగిరెడ్డి అన్నారు. శనివారం తుర్కపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు నాలుగు మండలాల క్లస్టర్ సాయి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక మండలాల్లో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా అమలు చేయబడుతున్న పథకాల వివరాలు నమోదు చేయడం రాబోవు రోజుల్లో గ్రామాల్లో ఏ ఏ పనులు చేయాల్సినవి ఉన్నాయని వాటిని చేయడానికి అమౌంట్ అవుతుందని ఆర్డర్ ఆఫ్ ప్రయారిటీ చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయం నీటి సరఫరా విద్యుత్ ఉపాధి హామీ బి బి జి రాంజీ శాఖలపై సమీక్ష నిర్వహించినట్టు తెలిపారు. ఆయా శాఖల ద్వారా అమలు చేయబడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఎల్ నినో సమస్య వలన రైతులు సగం వరి పంటను సగం ఆరుపడి తండాలను వేసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ ద్వారా జలసిరి కార్యక్రమం కింద ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ఊరికి ఊట కుంటలను ఉపయోగించుకొని నీటి ఎద్దడిని తట్టుకునే ప్రణాళిక చేసుకోవాలని అన్నారు. ఎండిపోయిన బోరుబావులను పునరుద్ధరించాలని, కూలీలతో పనులు వేగవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి ,ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, ఏపీవో లు ఎర్ర నారాయణ, నరసయ్య, శ్రీలక్ష్మి, ఈసీ లు యశోద, కరుణాకర్, రాజశేఖర్, టిఏ లు చందు, జ్యోతి, జైపాల్, వెంకట్ సాగర్, ఏఈఆర్డబ్ల్యూఎస్ అనంతరెడ్డి, ఏఈ హౌసింగ్ నరేష్, ఏటీఎం రమణ, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో పతాక స్థాయికి చేరిన కుమ్ములాటలు

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 22 :**



తెలంగాణలో మరోసారి అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్న వేళ, సొంత పార్టీలోనే అసమ్మతి సెగలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి సహజ సిద్ధమైన "అంతర్గత ప్రజాస్వామ్యం" అనే ముసుగులో నేతలు హద్దులు దాటి బహిరంగ విమర్శలకు దిగడం ఇప్పుడు గాంధీభవన్‌ను కుదిపేస్తోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, చిన్నా రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి వంటి సీనియర్ల అసంతృప్తి ఒక ఎత్తయితే, తాజాగా మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ నేరుగా ముఖ్యమంత్రినే లక్ష్యంగా చేసుకుని చేసిన తీవ్ర వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.వరంగల్ జిల్లా గీసుకొండ వేదికగా కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోని అసలైన ఘర్షణ స్వభావాన్ని బయటపెట్టాయి. సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సిద్ధాంతాలు ఒంటబట్టలేదని, పార్టీ క్రమంగా 'టీడీపీ కాంగ్రెస్'గా మారుతోందంటూ ఆమె నేరుగా సిద్ధాంతపరమైన దాడికి దిగారు. పరకాల టికెట్ వ్యవహారంలో సీఎం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ, "మాకు టికెట్ నిరాకరించడానికి రేవంత్ రెడ్డి ఎవరు?" అని ప్రశ్నించడం అధిష్టాన స్థాయికి చేరిన అంతర్గత పోరును సూచిస్తోంది. కొడంగల్‌లో గతంలో ఆయన ఓడిపోయిన సందర్భాన్ని, రేవంత్‌ను పీసీసీ అధ్యక్షుడిగా సమర్థించిన గతాన్ని ప్రస్తావిస్తూ స్వతంత్రంగానైనా బరిలోకి దిగుతానని హెచ్చరించడం తీవ్ర స్థాయి ధిక్కారానికి నిదర్శనం.ఈ తిరుగుబాటు కేవలం ఒక్క నియోజకవర్గ టికెట్ పోరు మాత్రమే కాదు. కాంగ్రెస్‌లో ఎప్పటినుంచో రగులుతున్న 'వలస నేతలు వర్సెస్ ఒరిజినల్ కాంగ్రెస్' వివాదానికి ఇది పరాకాష్ట. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు ప్రాధాన్యం దక్కుతోందని, ఉద్యమ కాలం నుంచి పార్టీని మోసిన పాత తరం నేతలు, ముఖ్యంగా బీసీ నాయకత్వం క్రమంగా పక్కకు నెట్టివేయబడుతోందనే అసహనం ఈ వరుస ప్రకటనల్లో స్పష్టంగా వ్యక్తమవుతోంది.మరోవైపు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, క్రమశిక్షణా కమిటీ ఈ పరిణామాలను అదుపు చేయడంలో పూర్తిగా నిస్సహాయంగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం, పార్టీ విధానాలపై బహిరంగంగా విరుచుకుపడుతున్న కీలక నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేకపోవడం నాయకత్వ లోపాన్ని, సమన్వయ లేమిని ఎత్తిచూపుతోంది. ఎంపీ మల్లు రవి వంటి సీనియర్లు క్రమశిక్షణపై పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ ప్రభావం ఏమాత్రం కనిపించడం లేదు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, పాలనాపరమైన సంస్కరణలపై దృష్టి సారిస్తున్న సమయంలో, సొంత క్యాబినెట్ సహచరుల కుటుంబాల నుంచే వస్తున్న ఈ రకమైన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. అంతర్గత కుమ్ములాటల రూపంలో సాగుతున్న ఈ పరిణామాలు ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు బలమైన రాజకీయ ఆయుధంగా మారుతున్నాయి.పాలనపై ప్రతిపక్షాల విమర్శల కంటే సొంత పార్టీ నేతల అసమ్మతి బాణాలే ప్రభుత్వానికి పెద్ద ముప్పుగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఏఐసీసీ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని సమన్వయ కమిటీ ద్వారా అసమ్మతి నేతలతో చర్చలు జరపకపోతే లేదా కఠినమైన క్రమశిక్షణా చర్యలు చేపట్టకపోతే, ఈ అంతర్గత విభేదాలు మరింత విస్తరించి ప్రభుత్వ స్థిరత్వానికే పెద్ద సవాలుగా మారే అవకాశముంది.

# మన్యంకొండలో వైభవంగా తిరుచ్చి వాహన సేవ

- **సాంప్రదాయ రీతిలో చైర్మన్ అళ హరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు**
- **అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చిన స్వామివారు**

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే అందులో భాగంగానే ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామివారిని దేవస్థానం పురవీధుల గుండా ఊరేగించారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వైద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరినా మశ్చరణల మధ్య స్వామి వారి సేవ ముందుకు కదిలింది. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తిరిగి మళ్ళీ తిరుచ్చి వాహనంపై గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారు తిరుచ్చి వాహనంపై అలంకరణలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు తన్మయం చెందారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశ పారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ ,ఈఓ శ్రీనివాస రాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, దేవస్థానం పురహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాలనుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తజన సందోహంతో పులకించిన మన్యం "కొండలు"

- **శ్రావణమాసం సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు**
- **చైర్మన్ అళ హరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు**

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం శనివారం జనసంద్రమైంది. శ్రావణమాసంలోని శనివారాన్ని పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుండి కొన్ని వేల మంది భక్తులు స్వామి దర్శనానికి మన్యంకొండకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో మన్యంకొండలు భక్త జన సందోహంతో పులకించిపోయాయి. దేవస్థానం పరిసరాలలో ఎక్కడ చూసినా భక్తులే కనిపించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ముందుగా దేవస్థానం ముందున్న కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి దర్శనానికి ఉదయం 7 గంటల నుండే బారులు తీరారు. విశేష దినోత్సవాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వద్దా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో స్వామివారు అలంకరణలో భక్త కోటీకి దర్శనం ఇచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు పులకించి పోయారు. అలాగే దిగకుండా వద్దనున్న శ్రీ అలివేలు మంగతాయారు దేవస్థానంలో కూడా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ కూడా అభిషేకాలు, అర్చనలు తదితర పూజ నిర్వహించారు. అలాగే దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కూడా భక్తులు పూజలు నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమాలలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాస రాజు, ప్రధాన అర్చకులు రాజేష్, నరసింహయ్యలతోపాటు దేవస్థానం పురోహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధనుష్ పొలిటికల్ ఎంట్రీ

**జయభేరి, చెన్నై ఆగస్టు 22 :**



తమిళ స్టార్ ధనుష్ చుట్టూ పొలిటికల్ ఎంట్రీకి సంబంధించిన చర్చ రోజురోజుకీ పెరుగుతోంది. తాజాగా ఆయన సోషల్ మీడియా ప్రెజెన్స్‌ను మరింత బలోపేతం చేసేందుకు.. రాజకీయ పార్టీల డిజిటల్ టీమ్స్ తరహాలో ప్రత్యేకంగా ఓ ఐటీ వింగ్ ఏర్పాటు చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది .ఈ డిజిటల్ టీమ్ కోసం దాదాపు ₹1 కోటి వరకు ఖర్చు చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. సోషల్ మీడియాలో ధనుష్‌కు సంబంధించిన కంటెంట్‌ను పర్యవేక్షించడం, ఫ్యాన్ బేస్‌ను మరింత యాక్టివ్‌గా మార్చడం, ఆయన కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి బాధ్యతలు ఈ టీమ్ చూసుకోనుందని టాక్.ఇది నిజమైతే.. కేవలం సినిమా ప్రమోషన్ కోసం ఏర్పాటు చేస్తున్న టీమ్ కంటే చాలా పెద్ద వ్యవస్థగా ఉండొచ్చనే చర్చ మొదలైంది. ముఖ్యంగా తమిళనాడులో రాజకీయ పార్టీల ఐటీ వింగ్స్ సోషల్ మీడియా నేరేటివ్, గ్రౌండ్ లెవల్ కమ్యూనికేషన్, డిజిటల్ క్యాంపెయిన్లలో కీలకంగా మారిన నేపథ్యంలో.. ధనుష్ కూడా అదే తరహా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారన్న వార్త ఆసక్తిని పెంచుతోంది.ఇప్పటికే ధనుష్ ఫ్యాన్ క్లబ్స్‌లో కదలికలు పెరిగాయి. సంక్షేమ కార్యక్రమాలు చేయాలని అభిమానులకు ఆయన పిలుపునివ్వడం, ఫ్యాన్ క్లబ్ కార్యకలాపాలు విస్తరించడం, కొన్ని ప్రాంతాల్లో వాటిని మరింత వ్యవస్థీకృతం చేయడం వంటి పరిణామాలు పొలిటికల్ ఎంట్రీ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి.అయితే.. ధనుష్ రాజకీయాల్లోకి వస్తున్నారన్నది ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. ₹1 కోటి ఖర్చుతో ఐటీ వింగ్ ఏర్పాటు చేస్తున్నారన్న వార్తకు కూడా ధనుష్ లేదా ఆయన టీమ్ నుంచి అధికారిక ధృవీకరణ లేదు.కానీ వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే.. ధనుష్ విషయంలో అసలు సినిమా ఏంటి, పొలిటికల్ స్కెచ్ ఏంటి అనేది ఇప్పుడు తమిళనాట ఆసక్తికరంగా మారింది



# నేడు దేవరకద్ర ఎమ్మెల్యే పర్యటన

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదివారం నియోజకవర్గంలోని ఆయా మండలాలలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఉదయం 10 గంటలకు భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలో పాపులర్ క్రికెట్ హబ్ (బాక్స్ క్రికెట్) ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొంటారు. అలాగే 1030 గంటలకు మూసాపేట్ మండలం పోల్కంపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 50 లక్షల నిధులతో చేపడుతున్న శివాలయం పునర్నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారు. 11 గంటలకు మూసాపేట్ మండలం సంకల్ మద్ది గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిర్వహిస్తున్న ప్రారంభోత్సవ కార్యక్రమాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొంటారు.కావున ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్, సేవదళ్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

# డాక్టర్ రాములు నాయక్ స్మారక రక్తదాన శిబిరానికి విశేష స్పందన



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని సాయి వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శనివారం డాక్టర్ రాములు నాయక్ స్మారకార్థం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగింది. డాక్టర్ రాములు నాయక్ జ్ఞాపకార్థం, ఆయన సేవా స్ఫూర్తిని కొనసాగించాలనే ఉద్దేశంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు డాక్టర్ ఆంజనేయులు ప్రవళిక తెలిపారు. వైద్య రంగంలో ఆయన అందించిన సేవలను పలువురు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. శిబిరంలో పలువురు యువకులు, స్థానికులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. రక్తదాతలను అభినందిస్తూ, మరింత మంది యువత స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాములు నాయక్ కుటుంబ సభ్యులు, హాస్పిటల్ సిబ్బంది, రక్తదాతలు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# దళితపేటలో సమస్యలు పరిష్కరించాలి

**జయభేరి, పరవాడ :**

సామాజిక శంఖారావం రాష్ట్రవ్యాప్తంగా దళితులపై వివక్షతకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు సర్వేలకు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా శనివారం కలపాక, లంకెలపాలెం, పెద్ద ముసిడివాడ, కన్నూరు, రావాడ, గ్రామంలో సిఐటియు నాయకులు గనిశెట్టి.సత్యనారాయణ పర్యటన చేసారు.ఆయా గ్రామంలలో ఎదుర్కొంటున్న సమస్యలపై దళితులును ఆరా తీయడం జరిగింది. కలపాకలో ఇంటింటి కొళాయిలు రావడం లేదని వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయాలని. పారిశుధ్యం మెరుగుపరచాలని రావాడ దళితులకు స్మశాన వాటికి రోడ్డు లేకపోవడం విచారకరమన్నారు. దళిత యువకులకు ప్రవేట్ పరిశ్రమల్లో ఉపాధి కల్పించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు. ఈ నెల 24 న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దళిత సమస్యలపై ధర్నా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# ఆటోల నిరవధిక బందుకు మద్దతు ఇవ్వాలి

- **మహబూబ్ నగర్ జిల్లా ఆటో యూనియన్ జేఏసీ ప్రధాన కార్యదర్శి కే. రాము**
- **దేవరకద్రలో జీపు యూనియన్ సభ్యులకు కరపత్రాల పంపిణీ**



**జయభేరి, దేవరకద్ర :**

ఈనెల 23 అర్ధరాత్రి నుంచి 24 వ తారీకు వరకు నిర్వహించే ఆటోల నిరవధిక బందుకు మద్దతు ఇవ్వాలని మహబూబ్ నగర్ జిల్లా ఆటో యూనియన్ జేఏసీ ప్రధాన కార్యదర్శి కే. రాము కోరారు.దేవరకద్ర శ్రీ వీర గురు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కమాండర్ జీప్ అసోసియేషన్ సభ్యులకు శనివారం ఆటో నిరవధిక బంద్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఆటోల నిరవధిక బంద్ కు అందరూ మద్దతు ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిప్ యూనియన్ సభ్యులు ఆంజనేయులు, భవాని, ఇమ్రాన్ మరికల్ జీప్ అసోసియేషన్ అధ్యక్షుడు జావిద్, కృష్ణారెడ్డి లతోపాటు శ్రీ వీర గురు ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కోట్ల రామకృష్ణ, ఆటో డ్రైవర్లు భీమా చారి, రాఘవేంద్ర, అంజి తదితరులు పాల్గొన్నారు.

# పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయం దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ శనివారం జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని గొల్లపల్లి లో జరిగిన పబ్బతి ఆంజనేయస్వామి దశాబ్ది ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే శేఖర్ ను గ్రామస్తులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన పలు ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గోపి కుటుంబానికి ఆర్థిక సహాయం



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం లోని వింజమూరు గ్రామం దేవుల తండా కు చెందిన వంకుడావత్ గోపి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈసందర్భంగా నేడు వారి నివాసం వద్ద కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు ఈ సందర్భంగా వంకుడవత్ గోపి కుటుంబ సభ్యులకు 10,000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని BRS రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ అందజేశారు ఆయన వెంట స్థానిక సర్పంచ్ అనిత దాసు నాయక్, దండెటి కార్ ప్రసాద్, ఉపసర్పంచ్ చందర్ నాయక్, కేతావత్ హరిలాల్ నాయక్, వార్డు సభ్యులు మహేమహుద్, రాము నాయక్, రాము, లచ్చు నాయక్, వస్రం నాయక్, నేనావత్ నాగార్జున నాయక్ తదితరులు ఉన్నారు.



# పీరియడ్స్ టైమ్‌లో చేసే వర్కవుట్స్

## అవి చేయవద్దంటున్న నిపుణులు

నెలసరి సమయంలో వ్యాయామం చేయాలా వద్దా అని చాలా మంది సందేహిస్తుంటారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం నెలసరి సమయంలో తేలికపాటి , సరైన వ్యాయామాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయి. అయితే తీవ్రమైన వ్యాయామాలకు దూరంగా ఉండటం ఉత్తమం. రుతుక్రమ సమయంలో శరీరం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం అవసరం. ఇది కేవలం ఆహారానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు, వ్యాయామం పట్ల కూడా దృష్టి సారించాలి. అంతర్జాతీయ యోగా దినోత్సవం సమీపిస్తోంది. రుతుక్రమ సమయంలో ఏ యోగాసనాలు వేయవచ్చు.వేటిని నివారించాలి అనే విషయాలు మీకు తెలుసా? గోల్డ్ మెడలిస్ట్ శిల్పా దాస్ దీనికి సంబంధించిన వివరాలను పంచుకుంటున్నారు. రుతుక్రమ సమయంలో మీరు నడక, పరుగు, ఫ్రీహ్యాండ్ వ్యాయామాలు, స్కిప్పింగ్ (జంపింగ్ రోప్), బరువులు ఎత్తడం, సైక్లింగ్ వంటి మీకు నచ్చిన ఏ రకమైన వ్యాయామాన్నైనా చేయవచ్చని శిల్పా దాస్ చెబుతున్నారు. న్యూస్18 బెంగాల్ కథనం ప్రకారం క్రంచెస్, లంజెస్, పైలేట్స్ ,యోగా వంటివి కూడా ఇందులో ఎంపికలే. వీటిని మితంగా లేదా తీవ్రమైన స్థాయిలో కూడా చేయవచ్చు.

మీకు శారీరకంగా బాగా అనిపిస్తున్నంత వరకు, మీరు ఎలాంటి వ్యాయామమైనా చేయవచ్చు. ఈ ప్రత్యేక రోజుల్లో, మీకు చేయడానికి సౌకర్యవంతంగా అనిపించే వ్యాయామాలను ఎంచుకోండి. మీరు చాలా అలసటగా లేదా నీరసంగా అనిపిస్తే నెలసరి సమయంలో అధిక వ్యాయామానికి దూరంగా ఉండటం మంచిది. వ్యాయామం మీ శరీరానికే కాకుండా మీ మనసుకు కూడా మేలు చేస్తుంది. క్రమం తప్పని వ్యాయామం ఒత్తిడిని అదుపులో ఉంచుకోవడానికి, బాగా నిద్రపోవడానికి , చురుకుగా ఉండటానికి సహాయపడుతుంది. క్రమం తప్పని వ్యాయామ దినచర్యను పాటించడం వల్ల నెలసరి తలనొప్పులు, నడుము నొప్పులు వంటివాటిని నివారించవచ్చు.

ఇది పొత్తికడుపు నొప్పి వంటి సమస్యలను నిర్వహించడాన్ని సులభతరం చేస్తుంది. అలాగే ఇది శరీరం అంతటా రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చూస్తుంది. అందువల్ల రుతుక్రమ సమయంలో కేవలం పడుకోవడం లేదా కూర్చోవడం కంటే, ఏదైనా శారీరక కార్యకలాపాల్లో పాల్గొనడం అన్ని విధాలా ఆరోగ్యకరమైన అలవాటు. స్త్రీ రోగ నిపుణురాలు డాక్టర్ శాశ్వత మండల్ చెప్పిన దాని ప్రకారం అండాశయాలకు సంబంధించిన నిర్దిష్ట సమస్యలు ఉన్నవారికి మాత్రమే తాడుతో గెంతుట (jumping rope) వంటి కొన్ని రకాల వ్యాయామాలు చేయవద్దని సూచించబడింది. అయితే రుతుక్రమ సమయంలో ఇతర రకాల వ్యాయామాలను మాత్రం చేయవచ్చు.

రుతుక్రమ సమయంలో కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంలో స్ట్రెచింగ్ లేదా తేలికపాటి యోగా, ముఖ్యంగా 'బాలాసన' అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తాయి.'మార్జాలాసనం' ఇది కండరాల నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది.

ప్రతి స్త్రీ శరీరం భిన్నంగా ఉంటుంది కాబట్టి శ్రమతో కూడిన వ్యాయామాలు లేదా అధిక ఒత్తిడిని నివారించి, వారి వారి శారీరక పరిస్థితికి అనుగుణంగా వ్యాయామం చేయాలి. రుతుస్రావం సమయంలో 30-40 నిమిషాల తేలికపాటి నడక రక్త ప్రసరణను పెంచుతుంది, ఇది కడుపు నొప్పిని తగ్గించడానికి అద్భుతంగా పనిచేస్తుంది.



# హార్ట్ ఎటాక్‌కు ముందు ఫైనల్ వార్నింగ్స్ ఇవే..!

## శరీరంలో ఈ మార్పులు కనిపిస్తే అస్సలు లైట్ తీసుకోవద్దు

హార్ట్ ఎటాక్ ముందు ఛాతినొప్పి, శ్వాసకోశ ఇబ్బంది, చెమటలు, తీవ్రమైన అలసట, జీర్ణ సమస్యలు వస్తాయని డాక్టర్ హెచ్చరిక, లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి ప్రస్తుత ఆధునిక కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాలా మందిని హఠాత్తుగా కబళిస్తున్న మహమ్మారి హార్ట్ ఎటాక్ . ఒకప్పుడు యాభై, అరవై ఏళ్లు పైబడిన వారిలోనే ఈ సమస్య కనిపించేది, కానీ నేడు మారుతున్న జీవనశైలి, విపరీతమైన మానసిక ఒత్తిడి, జంక్ ఫుడ్స్ అలవాటు, నిద్రలేమి కారణంగా ఇరవై, ముప్పై ఏళ్ల యువత కూడా గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే చాలా మంది హార్ట్ ఎటాక్ అనేది అకస్మాత్తుగా వస్తుందని భావిస్తారు. విశాఖపట్నంలోని కేర్ హాస్పిటల్ రోబోటిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ భరత్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం, గుండెపోటు వచ్చే కొన్ని రోజుల ముందు లేదా కొన్ని గంటల ముందే మన శరీరం కొన్ని స్పష్టమైన ముందస్తు సంకేతాలను, ఫైనల్ వార్నింగ్‌స్‌ను ఇస్తుంది. వాటిని సరైన సమయంలో గుర్తించి అలర్ట్ అయితే ప్రాణాపాయం నుండి సులభంగా బయటపడవచ్చు అంటున్నారు.

గుండెపోటుకు సంబంధించి శరీరం ఇచ్చే మొదటి, అత్యంత ముఖ్యమైన సంకేతం ఛాతీలో అసౌకర్యం లేదా నొప్పి. ఛాతీ మధ్యభాగంలో విపరీతమైన ఒత్తిడి, ఎవరో గట్టిగా నొక్కి పట్టినట్టు ఉండటం లేదా మంటగా అనిపించడాన్ని అస్సలు తేలికగా తీసుకోకూడదు. చాలా మంది దీనిని సాధారణ గ్యాస్ సమస్య లేదా ఎసిడిటీ అని భ్రమపడి నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ నొప్పి కేవలం ఛాతీకే పరిమితం కాకుండా క్రమంగా ఎడమ చేయి, మెడ, దవడ, వెనుక భాగం వైపు పాకుతున్నట్టు అనిపిస్తే అది ఖచ్చితంగా గుండె జబ్బుకు సంకేతమేనని గ్రహించాలి. ఇటువంటి అసౌకర్యం పదే పదే వస్తుంటే ఆలస్యం చేయకుండా వెంటనే కార్డియాలజిస్ట్‌ను సంప్రదించడం మంచిదని వైద్యులు చెబుతున్నారు.

ఇక శరీరంలో వచ్చే రెండో ప్రధానమైన మార్పు.. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అకస్మాత్తుగా విపరీతమైన చెమటలు పట్టడం. ఎలాంటి శారీరక శ్రమ చేయకపోయినా, ఏసీ గదిలో కూర్చున్నప్పటికీ ఒక్కసారిగా ఒళ్లంతా చల్లటి చెమటలు పట్టడం హార్ట్ ఎటాక్‌కు బలమైన సూచన. గుండెకు రక్తప్రసరణ సరిగ్గా అందనప్పుడు, అది రక్తాన్ని పంప్ చేయడానికి సాధారణం కంటే ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడానికి మెదడు చెమట గ్రంథులను ప్రేరేపిస్తుంది. దీనితో పాటు ఊపిరి ఆడకపోవడం, కొద్ది దూరం నడిచినా గుండె వేగంగా కొట్టుకుంటూ పరుగు తీసినట్లు అనిపిస్తే గుండె ప్రమాదంలో ఉందని అర్థం.

ఇక మూడో, నాల్గో మార్పుల విషయానికి వస్తే.. తీవ్రమైన అలసట, మైకం, జీర్ణక్రియలో అకస్మాత్తుగా వచ్చే తేడాలు. రాత్రి వేళల్లో పర్ఫెక్ట్‌గా నిద్రపోయినప్పటికీ, పగటిపూట విపరీతమైన నీరసం, కాళ్లు చేతులు ఆడనంత అలసటగా అనిపించడం గుండె బలహీనతకు సంకేతం. ఎందుకంటే గుండె సరిగ్గా పనిచేయనప్పుడు మెదడుతో పాటు శరీరంలోని ఇతర అవయవాలకు ఆక్సిజన్ కలిగిన రక్తం సరిగ్గా అందదు. దీనివల్ల తల తిరగడం, కళ్లు బైర్లు కమ్మడం లేదా స్పృహ తప్పి పడిపోయే పరిస్థితులు వస్తాయి. అలాగే కొందరిలో హార్ట్ ఎటాక్‌కు ముందు వికారం, వాంతులు కావడం లేదా కడుపులో విపరీతమైన అసౌకర్యం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. గుండె అనేది మన ప్రాణానికి ఆధారం, అందుకే పైన పేర్కొన్న నాలుగు మార్పులలో ఏ ఒక్కటి మీ శరీరంలో కనిపించినా 'లైట్ ' తీసుకోవద్దు. ముఖ్యంగా బీపీ, షుగర్, ఊబకాయం ఉన్నవారు మరియు కుటుంబంలో గుండెజబ్బుల చరిత్ర ఉన్నవారు ఈ లక్షణాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం, పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం చాలా అవసరం. అన్నింటి కంటే ముఖ్యంగా ఏటా ఒకసారి గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా రాబోయే ముప్పును ముందే అడ్డుకోవచ్చు.

(సేకరణ : News 18)



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దుననిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం. శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి.ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్


సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్‌స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.



# 7 ఏళ్లుగా సహ జీవనం.. ఇద్దరు పిల్లలు..



'ధురంధర్' సినిమాలో విలన్‌గా నటించి పాన్ ఇండియా రేంజ్ లో ఫేమస్ అయిన నటుడు అర్జున్ రాంపాల్ రెండో వివాహం చేసుకున్నాడు. తన ప్రియురాలు గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌తో కలిసి అధికారికంగా మూడు ముళ్ల బంధలోకి అడుగు పెట్టాడు. ఉత్తర గోవాలోని మపుసా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వీరు రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. శుక్రవారం (ఆగస్టు 21) సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈ ప్రేమ పక్షులు ఉత్తర గోవాలోని మపుసాలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఇద్దరూ సాధారణ దుస్తులు ధరించి ఉన్నారు. రిజిస్టర్ మ్యారేజ సమయంలో వారితో పాటు కొందరు స్నేహితులు, సన్నిహితులు కూడా ఉన్నారు. అర్జున్‌గాబ్రియెల్లాల వివాహం గోవా యూసీసీ (UCC) కింద నమోదు చేయబడిందని సబ్‌రిజిస్ట్రార్ సూరజ్ వెర్నేకర్ తెలిపారు. కాగా అర్జున్, గాబ్రియెల్లా 2018 నుంచి కలిసి ఉంటుననారు. చాలా కాలం పాటు సహజీవనం చేసిన తర్వాత, వీరిద్దరూ డిసెంబర్ 2025లో నిశ్చితార్థం చేసుకున్నారు. ఇప్పుడు అధికారికంగా పెళ్లిపీటలెక్కారు. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌లకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2019లో అరిక్ జన్మించగా, 2023లో ఆరవ్ పుట్టాడు. కాగా వీరికి బాలీవుడ్ లో మంచి పాపులారిటీ క్రేజ్ ఉంది. అయితే తమ వ్యక్తిగత జీవితాల విషయంలో మాత్రం చాలా గోప్యతను పాటిస్తారు. ఇక అర్జున్ భార్య విషయానికి వస్తే.. గాబ్రియెల్లా డెమెట్రియాడెస్ దక్షిణాఫ్రికాలో పుట్టి పెరిగింది. కేవలం 16 ఏళ్ల వయసులోనే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత ఫ్యాషన్ డిజైనర్ గానూ సత్తా చాటింది. ఆ తర్వాత నటిగా సినిమాల్లోకి అడుగు పెట్టింది. పలు హిందీ సినిమాలు, వెబ్ సిరీసుల్లో నటించిన ఆమె తెలుగు ప్రేక్షకులకు కూడా ఆమె సుపరిచితమే. అక్కినేని నాగార్జున, కార్తీ హీరోలుగా నటించిన 'ఊపిరి' సినిమాలో గాబ్రియెల్లా కీలక పాత్రలో నటించింది.



## ఇది సత్యం మాట.. ఇంకా డౌటా!

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 158వ చిత్రానికి 'కాకా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బాబీ కొల్లి దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదలకానుంది. శనివారం చిరంజీవి జన్మదినం సందర్భంగా టైటిల్ ప్రకటనతో పాటు గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో ఆక్వా ఇండస్ట్రీస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసే సత్యం పాత్రలో కనిపించారు చిరంజీవి. రెండు విభిన్నమైన లుక్స్‌తో ఆయన ఆకట్టుకున్నారు. 'ఇది సత్యం మాట..ఇంకా డౌటా' అంటూ చిరు చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, సంభాషణలు: భానునందు, రచనదర్శకత్వం: బాబీ కొల్లి.

**'విశ్వంభర' స్పెషల్ పోస్టర్**


మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని 'విశ్వంభర' చిత్రం నుంచి కొత్త పోస్టర్‌తో పాటు ఒరిజినల్ సౌండ్ ట్రాక్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో చిరంజీవి ఫెరోషియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. దైవత్వం, వీరత్వం కూడిన ప్రపంచాన్ని పోస్టర్ ప్రజెంట్ చేస్తున్నది. త్వరలో ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ సోషియో ఫాంటసీ చిత్రాన్ని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. కీరవాణి స్వరకర్త.

## 30వ సినిమా ఆ దర్శకుడితోనే?



అగ్ర హీరో మహేశ్‌బాబు ప్రస్తుతం తన 29వ సినిమా 'వారణాసి'లో నటిస్తున్నారు. ఈ అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో మహేశ్‌బాబు ఓ సినిమా చేయబోతున్నారని గతకొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంలో ఇప్పటివరకూ అధికారికంగా ఎలాంటి సమాచారం వెలువడలేదు. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్ రెడ్డి సోదరుడు, నిర్మాత ప్రణయ్‌రెడ్డి వంగా ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడించారు. మహేష్‌బాబుసందీప్‌రెడ్డి వంగా కాంబో ప్రాజెక్ట్ తప్పకుండా ఉంటుందని చెప్పారు. అయితే హిందీలో సందీప్ రెడ్డి వంగా 'యానిమల్' సీక్వెల్ 'యానిమల్ పార్క్' పూర్తిచేసిన తర్వాతే మహేశ్‌బాబుతో చేసే సినిమా మొదలయ్యే అవకాశాలున్నాయని హింట్ ఇచ్చారు. కొంత సమయం పట్టినప్పటికీ వారిద్దరి కాంబినేషన్‌లో సినిమా మాత్రం పక్కా అన్నట్లు మాట్లాడారు ప్రణయ్ రెడ్డి వంగా. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు ప్రతిష్టాత్మక 30వ సినిమా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలోనే తెరకెక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు.

## 'సహ' మూవీ సెప్టెంబర్ 4న రిలీజ్



నిశాంత్ దోటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎమోషనల్ డ్రామా 'సహ (లైఫ్ ఆఫ్ సంజు)' ప్రస్తుతం ప్రమోషన్స్ తో సందడి చేస్తోంది. శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ప్రేమ, అనుబంధాలు, జ్ఞాపకాలు, జీవితంలో ఎదురయ్యే భావోద్వేగ సంఘర్షణల చుట్టూ సాగనుంది. సుమైరా స్టూడియోస్ బ్యానర్‌పై తేజ వెల్పుచర్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రమోషనల్ కంటెంట్ తో ఆసక్తి పెంచుకున్న 'సహ' సెప్టెంబర్ 4న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ జర్నీలో ఆత్మీయంగా కనిపించారు. ఈ విజువల్ ఇద్దరి మధ్య ప్రేమ, అనుబంధాన్ని సహజంగా చూపిస్తూ సినిమా నేపథ్యంపై ఆసక్తిని పెంచుతోంది.

సంజు జీవితంలోని వివిధ దశలను ఈ సినిమా ప్రజెంట్ చేస్తోంది. ప్రేమ, విడిపోవడం, మధురమైన జ్ఞాపకాలు, కష్టాలను అధిగమించేందుకు అవసరమైన మనోధైర్యం వంటి అంశాలను కథలో చూపించనున్నారు. పాత్రలు, వాటి మధ్య ఉండే అనుబంధాల ద్వారా ఒక మనసుకు దగ్గరయ్యే ఎమోషనల్ జర్నీగా అందించనున్నాయి. ఈ చిత్రంలో ప్రజనా పాండ్యా, మహిపాల్, అప్పాజీ, భారతి, మేఘన సునీల్, బాంబే పద్మ, కొండారెడ్డి, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా కరుణాకర్ కె, ఎడిటర్‌గా దినేష్ పెద్ది, సంగీత దర్శకుడిగా శేఖర్ చంద్ర పనిచేస్తున్నారు. తారాగణం: శివ కుమార్ కాసారం, శ్వేత లక్ష్మణ్, ప్రజన పాండ్య, మహిపాల్, అప్పాజీ, భారతి, మేఘన సునీల్, బొంబాయి పద్మ, కొండా రెడ్డి, హర్షవర్ధన్,



## ఆరోజు దారుణంగా ప్రవర్తించారు..

ప్రస్తుతం ఇరుముడి సినిమాతో సూపర్ హిట్ అందుకుంది హీరోయిన్ ప్రియా భవానీ శంకర్. మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. ఆగస్ట్ 21న విడుదలైన ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ వస్తుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియా భవానీ శంకర్ కోలీవుడ్ హీరో గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. ఆమె యాంకర్‌గా ఉన్న రోజుల్లో ప్రముఖ నటుడు ధనుష్‌ను ఇంటర్వ్యూ చేసిన ఒక సంఘటనను ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ధనుష్ చాలా అలసిపోయి, ఇంటర్వ్యూపై పెద్దగా ఆసక్తి చూపలేదని ఆమె తెలిపారు. దీని నుండి ఎప్పుడు బయటపడతాను? అన్నట్లుగా అతని మూడ్ ఉందని ప్రియ భవాని శంకర్ పేర్కొన్నారు. అప్పుడు అతని ప్రవర్తనను ఎంత అహంకారం! ఎంత యాటిట్యూడ్! అని ఆమె భావించారట. అయితే, కాలక్రమేణా ప్రియ భవాని శంకర్ నటిగా మారిన తర్వాత, సినిమా ప్రమోషన్లలో పాల్గొనడం ప్రారంభించారు. ఆ సమయంలో పదే పదే ఒకే రకమైన ప్రశ్నలను ఎదుర్కోవడం, అది ఎంత అలసటతో కూడుకున్నదో ఆమె స్వయంగా అనుభవించారు. అప్పుడే ధనుష్ ప్రవర్తన వెనుక ఉన్న కారణాన్ని ఆమె అర్థం చేసుకున్నారు. తాజాగా ధనుష్‌ను కలిసినప్పుడు లేదా అతనితో నటించినప్పుడు, నువ్వు చాలా రూడ్‌గా ఉన్నావని నేను నిజంగా అనుకున్నాను, డూడ్ అని తాను అతనికి చెప్పానని ప్రియ భవాని శంకర్ వెల్లడించారు. ఈ అనుభవం ద్వారా ఆమె ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్చుకున్నారు: తెరపై కనిపించే వారి అహంకారం లేదా నిర్లక్ష్యం వెనుక వారి సొంత సమస్యలు, ఒత్తిడి ఉండవచ్చు. వారు కేవలం తమ పరిస్థితికి ప్రతిబింబం మాత్రమేనని ఆమె అన్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**